# తెరవెనక

అర్థరాత్రి దాటి వుంటుంది. ఇంకో గంటకో అర గంటకో ఒక చీకటి మిత్రుడు రావాలి ఆ ఇంటికి. అతను ఎప్పుడూ చీకట్లో వొచ్చి చీకట్లో వెళ్తాడు.

రాజారావుకి నిద్రలో మళ్ళీ గుర్తొచ్చి కంగారుగా టేబుల్ మీదనించి వాచీ అందుకు చూశాడు. వెంటనే దుప్పటి సర్దుకుని మళ్ళీ నిద్రలో పడ్డాడు. సమయానికి తలుపు తియ్యలేక పోతానేమోనని అప్పటికి నాలుగైదుసార్లు వాచీ చూశాడు రాజారావు. నిన్నటి నుంచీ అతనికి జ్వరంగావుంది. రాత్రి అన్నం కూడా తినకుండా పడుకున్నాడు.

పడుకోబోయే ముందు రమణ రాజారావుతో- "నువ్వు లేవొద్దులే, తలుపు నే తీస్తాగా?" అని చాలాసార్లు చెప్పి పడుకున్నాడు. రమణ పక్క ఎక్కాడంటే ఇక భళ్ళున తెల్లారేదాకా లేచేమాటవొట్టిది. ఒకసారి రాజారావు ఇంట్లో లేనప్పుడు ఒక చీకటి మిత్రుడు వొస్తే అతను అరగంట సేపు బయట నించోవలసి వొచ్చింది. అప్పటికైనా రమణ ఎలా లేచాడో ఆశ్చర్యమే.

అందుకే రాజారావు- "నిన్ను నమ్ముకుని నేనూరుకుంటే మనందరి పనీ అయినట్టే" అన్నాడు.

"అలా కాదులే ఈసారి. నేను చెపుతున్నాగా... ... తలుపు చప్పుడవ్వగానే నేను తీస్తాగా", అని హామీ ఇచ్చాడే గానీ ఇప్పటికి ఒక్కసారి కూడా కదల్లేదు రమణ.

రాజారావుకి నిద్రపడుతోన్నా మెలుకువగానే వుంది. ఇక అతను వొచ్చే టైము అయిందని మత్తులోకి జారకుండా వుండడానికి ప్రయత్నిస్తున్నాడు.

తలుపుమీద నెమ్మదిగా చప్పుడైంది.

వులిక్కిపడి లేచాడు రాజారావు.

"ఎవరూ?" అన్నాడు చిన్న కంఠంతో.

"నేనే."

రాజారావు మంచంమీదనించి వొక్క దూకు దూకి తలుపు తీశాడు.

ఎవరో అతనిమీద హఠాత్తుగా పడి పట్టేశారు. మనిషిని అమాంతంగా ఎత్తేశారు. ఒకచెయ్యి నోరుమూసింది. రాజారావు గింజుకునే ప్రయత్నం చేశాడు. ఏమీ సాధ్యం కాలేదు.

అంతా అర్థమైంది అతనికి. పోలీసులు రెయిడ్ చేశారు.. అంతే. అది అర్థమయ్యేప్పటికి అతను వేన్‌లో వున్నాడు. వేన్ తలుపులు మూసేశారు.

తన నెవరో తట్టి లేపుతున్నట్టయింది రమణకి. విసుక్కుని పడుకోబోయాడు. ఎవరో అతన్ని బలవంతంగా లేవదీసి కూరోపెట్టారు. తర్వాత నించోబెట్టారు.

మత్తుగా కళ్ళు తెరిచాడు రమణ.

కొంచెం కొంచెంఅర్థమవుతోంది... పోలీసులా? రెయిడ్ చేశారా?... ఎలా జరిగింది! ?

నిర్ఘాంతపడిపోయాడు రమణ. రాజు కోసం చూశాడు చుట్టూ. ఎక్కడా లేడు. రమణకి ఒక్కసారి చెప్పలేనంత భయం వేసింది. రాజు ఏమయ్యాడు? పారిపోయాడా? తప్పించుకున్నాడా? రాజు తప్పించుకున్నాడంటే ఒక్కసారి భయం అంతా పోయినట్టనిపించింది. నిజంగా తప్పించుకున్నాడో లేదో! దొడ్లోకి వెళ్ళాడా? ఆందోళనగా లోపలి గుమ్మంవేపు చూస్తున్నాడు.

రెండు గదుల్లోనూ లైట్లు వెలుగుతున్నాయి. అసిస్టెంటు కమీషనరూ, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లూ, నలుగురైదుగురు జవాన్లూ యూనిఫారాల్లో వున్నారు. యూనిఫారాలు లేని స్పెషల్ బ్రాంచి జవాన్లూ, లా అండ్ ఆర్డర్ జవాన్లూ ఇరవై మంది దాకా వున్నారు. దాదాపు అందరి చేతుల్లోనూ పెద్దవో చిన్నవో తుపాకులున్నాయి. అందరూ హడావుడి పడిపోతున్నారు. రమణని పట్టుకున్న వాళ్ళు తప్ప మిగతా వాళ్ళంతా ఏదో వొక పని చేస్తున్నారు. డ్రాయర్లు లాగుతున్నారు. పెట్టెలు తెరుస్తున్నారు. అలమార్లు వెతుకుతున్నారు. మంచాలకింద దూరుతున్నారు. చాపచుట్టలు వూడదీస్తున్నారు. గోనె మూటలు గుమ్మరిస్తున్నారు.

ఇద్దరు ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు డెస్కుల్లో దొరికిన కార్బన్ కాపీలు టేబుల్‌మీదపెట్టి కంగారుగా చూశారు. - పెద్ద సంతోషం వాళ్ళ మొహాల్లో. బ్రహ్మాండమైన రహస్యం ఏదో దొరికిపోయినట్టు ఒకరి మొహాలు ఒకరు ఆతృతగా

చూసుకుంటున్నారు. అసిస్టెంట్ కమీషనర్ మొహం టార్చి లైటులాగా వెలుగుతోంది. మంచాల మీదనుంచి రెండు దుప్పట్లు తీసి నేలమీద పరిచారు. వాళ్ళకు దొరికిన పుస్తకాలూ, పత్రికలూ, కాయితాలూ అన్నీ దుప్పట్లోలో పడేసి మూటలు కట్టారు. ఇంట్లో ఒక్క కాయితం ముక్క మిగల కుండా అన్నీ వెతికి వెతికి మూటల్లో పడేశారు. పక్కింటి వాళ్ళ పిల్లాడు కాసేపు చదువుకుని రమణ మంచంమీద పడేసి పోయిన ఎక్కాల పుస్తకాన్ని నలుగురైదుగురు ఇన్‌స్పెక్టర్లు కంగారుగా పదిసార్లు తిరగేసి చూసి జాగ్రత్తగా మూటలో పడేశారు.

రమణ వొంటిమీద పైజమా బనీనూ మాత్రమే వున్నాయి. కుర్చీమీద వున్న చొక్కా అందుకోబోయాడు. ఇన్‌స్పెక్టర్ అతని చెయ్యి నెట్టేసి "అక్కర్లేదు కదలకు" అని గదించాడు.

ఇన్‌స్పెక్టర్ ఆ చొక్కా అనుమానంగా తీసి దాన్ని కాసేపు ఎత్తిపట్టి చూచీ ఒక జవాను కందించాడు. ఆ జవాను దాన్ని భయం భయంగా చూసి జాగ్రత్తగా మూటలో పడేశాడు. తాడుమీద వున్న బట్టలూ, అలమారులో వున్న బట్టలుకిందపడేసి మూటకట్టారు.

నాలుగైదు మూటలు సిద్ధం చెయ్యడంతో ఇల్లు సోదా చెయ్యడం పూర్తి అయింది.

మూటలన్నీ వేన్‌లోకి జేరేశారు.

రమణ చుట్టూ పది పదిహేను మంది జేరి లాక్కుపోయి వేన్‌లోకి ఎక్కించారు. రమణ వేన్‌లోకి రాగానే

రాజారావు కంగారుగా, ఆందోళనగా అతని మొహంచూశాడు వేన్‌లో రాజారావుని చూడగానే రమణ స్తంభించి నిలబడి పోయాడు.

ఇన్‌స్పెక్టర్లు అతన్ని రాజారావుకి దూరంగా గెంటి కూర్చోబెట్టారు. వేన్ నిండా పోలీసులు తుపాకులతో నించు న్నారు. వేనులో లైట్లు ఆర్పారు.

మిగిలిన పోలీసు బలగం అంతా మిగిలిన వేన్లనిండా ఎక్కారు.

వేన్లు బయల్దేరాయి-విజయ గర్వంతో.

రాజారావు వేన్‌లో కూర్చున్నప్పట్నించీ ఆలోచిస్తు న్నాడు- ఏ ఏ సంగతులు బయట పడతాయి? ఎవరెవరి విష యాలు? ఎంతవరకూ మరుగుపరచగలం? ఏది వొప్పుకోవాలి? ఏది వొప్పుకో కూడదు? ... 'పి' వొచ్చే టైము అయింది ... అతను కూడా సరిగ్గా సమయానికి వొచ్చి వీళ్ళకి పట్టుబడి పోతాడేమో! ... ఇంటి నిండా జనం గుమిగూడి వుంటే దూరం నించి చూసి గ్రహించలేడా ? - అంత తెలివి తక్కు వగా ప్రవర్తిస్తాడా? - అసలు ఇంత ఆశ్చర్యంగా ఎలా జరి గింది. ఇది ? ... ఎక్కడ పొరపాటు జరిగింది?- తెగ ఆలోచిస్తు న్నాడు. ఆందోళన పడుతున్నాడు.

రాజారావు భయపడ్డట్టుగానే ఆ చీకటి మిత్రుడు తన టైం ప్రకారం బయల్దేరి వొచ్చాడు. కానీ తను పోవలసిన ఇంటికి దగ్గిరిగా పోలీసు వేన్లు వుండడం చూసి. దూరంగా ఆగిపోయాడు. చీకట్లో ఒక చెట్టు వెనక నిలబడి ఆ వేన్లు వెళ్ళిపోయే వరకూ చూశాడు.

సంగతంతా అతనికి అర్థమైంది.

కొంచెం సేపు నిలబడి తన దారి మార్చుకుని చెట్ల కింది నించి చీకట్లోకి వెళ్ళిపోయాడు.

రమణ వేన్ పోతున్న దారి గమనిస్తున్నాడు. అప్పుడప్పుడూ రాజు వేపు చూడడానికి ప్రయత్నిస్తున్నాడు.

వేన్ ఒక పోలీసుస్టేషన్ గేటుదాటి చిన్న బిల్డింగ్ దగ్గర ఆగింది.

వేన్‌లో లైట్లు వేశారు, వేన్ తలుపులు తీసి ఇన్‌స్పెక్టర్లు రివాల్వర్లు సూటిగా పట్టుకుని దిగారు. ఇతర వేన్లలో నుంచి జవాన్లు దిగి పరుగుల్తో వొచ్చారు. రాజుని పదిమందీ, రమణని పదిమందీ పట్టుకుని వేన్‌లోంచి దింపి గబగబా లోపలికి ఎత్తుకుపోయారు.

ఒక జవాను పరుగున వెళ్ళి ఒక లాకప్ తాళం తీశాడు. మిగిలిన వాళ్ళంతా రాజునీ రమణనీ లాకపులోకి గెంటారు.

గబగబా తాళం వేశారు. పోలీసు బలగం అంతా తేలిగ్గా నిట్టూర్చారు.

ఇద్దరు విప్లవకారుల్ని పట్టాం... ఇకచూడు ! ఎన్ని రహస్యాలు కక్కిస్తామో !

ఇన్‌స్పెక్టర్లు మహోత్సాహంగా బూట్లు టక టక లాడించుకుంటూ పరుగులు తీస్తున్నారు.

ఫోను సంభాషణలు నడుస్తున్నాయి. డిప్యూటీ కమిషనర్ ఆఫీసుకీ, స్పెషల్ బ్రాంచి ఆఫీసుకీ ఫోన్లు మహోత్సాహంగా చెప్పేస్తున్నాయి.

"సార్ ! ఇప్పుడే... ఇద్దర్ని... లాకప్‌లో పడేశాం... ఆ ఇల్లు లాక్ చేసివుంచాం, మెటీరియల్ అంతా తెచ్చేశాం."

"... ... ..."

",..గ్రూపు సంగతి యింకా ఏం తేలీదు సార్!...ఇంకేం గ్రూపులెండి. మొన్న జరిగిన బాంబు వ్యవహారం వీళ్ళదిలాగే వుంది. ఆ కాయితాల్లో చాలా సంగతులున్నాయి. మనకు చాల ఉపయోగపడొచ్చు."

"... ... ..."

"ఇద్దరే సార్ ... ఇంకెవ్వరూ లేరు. ఆడవాళ్లు లేరు."

"... ... .."

"ఎస్ సార్"

"... ... ..."

"ఎస్ సార్"

ఆ "శుభవార్త" గంటసేపటివరకూ ఎవరెవరికో ఇంకా పోతూనే వుంది. రాజూ వాళ్లు కూర్చున్న లాకప్‌లోకి అంతా వినబడుతోంది.

లాకప్ గది కటిక చీకటిగా వుంది. రెండు బారల గది. నేలనిండా దుమ్ము. ఏదో కంపు.

రాజారావు రమణా ఒకరి పక్కన ఒకరు నిర్ఘాంతపడి కూర్చునివున్నారు- మౌనంగా.

లాకప్ ముందు ఇద్దరు పోలీసులు తుపాకులతో నిలబడి అప్పుడప్పుడూ అటూ ఇటూ తిరుగుతున్నారు. ఆఫీసు గదిలో గందరగోళంగా మాట్లాడుకుంటున్నారు. విధీ విరామం లేకుండా ఫోన్లు గణగణ మంటున్నాయి. పెద్దపెద్ద కంఠాలతో ఫోనుల్లో అరుస్తున్నారు?

రాజారావు ఆతృతగా అన్నాడు రమణతో- "ఆర్. పి.

డాక్యుమెంటు కూడా అందులో వుందా? నిన్న పంపించే శావా?"

"పంపించలేదు. 'పి' తీసుకెళ్తాడనుకున్నాం కదా?"

"అయితే మన గురించి తెలిసిపోతుందేమో." చాలా దిగులుపడ్డారు ఇద్దరూ.

"ఆ డాక్యుమెంటు అయితే పరవాలేదు. వేరేవాళ్ళ డాక్యుమెంట్లు చదువుకోడానికి తెచ్చుకుంటూనే వుంటాం కదా?... అంతకన్నా ప్రమాదం మనం నిన్న టైప్ చేసిన కాయితాలు..."

"వాటి సంగతి కూడా పర్వాలేదు. అంతా 'కోడ్' లో వుంది. వాళ్ళకేం అర్థం కాదు."

"అయినా ఇంకా కొన్ని వున్నాయి రాజా!"

"... ... ..."

"'పి' వొచ్చి వుంటా డంటావా?"

"రాలేదు. 'ఇద్దర్నే తెచ్చాం' అని ఇందాక పీళ్ళు చెపుతున్నారుగా. 'పి' పెద్ద ప్రమాదంలోంచి తప్పుకున్నాడు. అదే సంతోషం మనకి. మనం నాలుగేళ్లు జైల్లోవున్నా ఫర్వా లేదు."

మాట్లాడకండి" అని బయటినుంచి కాపలా పోలీసు అరిచాడు.

రెండు నిముషాలు ఆగి రాజూ రమణా బాగా గది మూలకి జరిగారు. అక్కడ నీళ్ళు పోయే తూమువుంది. కుళ్ళు కంపు కొడుతోంది.

రాజారావు నెమ్మదిగా అన్నాడు.

"మన పేర్లు ...అసలు పేర్లు చెప్పేద్దాం. మన సర్కిల్లో పేర్లు వొద్దు."

"ఎందుకూ ?"

"అదే మంచిది. అనవసరపు ప్రశ్నల పీడ వుండదు. మారుపేర్లు చెపితే మన కుటుంబాలగురించి వేరే కథలు సృష్టించుకోవలసి వొస్తుంది. అదంతా చాలా ప్రమాదం. వాళ్ళు వాకబు చేస్తారు."

వివరంగా చర్చించే టైములేదు.

అవసరమైనప్పుడు రాజారావు చెప్పినట్టు వినాలని రమణకి తెలుసు. "సరే" అన్నాడు.

"పీలై నంతవరకూ చాలా విషయాలు మనకు సంబంధం లేనట్టు చూసుకుందాం. నీ సంగతి గుర్తుందా?" మనం అనుకున్నట్టే. అంతే. ఆ రకంగానే వుండు నువ్వు."

"సరే"

పదిమందికి పైగా బూట్ల చప్పుళ్ళతో లాకప్ దగ్గిరికి వొచ్చారు.

రాజారావు రమణ చెవిలో గబగబా అన్నాడు "చాలా ధైర్యంగా వుండాలి మనం. ఉద్యమానికి ద్రోహం చెయ్యకూడదు."

లాకప్ తీశారు.

లోపలికి టార్చి వేశారు.

ఇద్దరు పోలీసులు రమణని పట్టుకున్నారు.

"పద"

రమణ బయటికి వెళ్ళాడు. మళ్ళీ లాకప్ మూశారు. రక్షక భటులంతా రమణచుట్టూ జేరి ఇంకా కొన్ని లాకప్ గదులముందునుంచి చిన్న హాలులోకి తీసుకు వెళ్లారు.

అక్కడ అసిస్టెంట్ కమీషనరూ, నలుగురు ఇనస్పెక్టర్లూ, అందరూ వేన్‌లో వొచ్చినవాళ్ళే. టేబుల్ చుట్టూ కూర్చుని వున్నారు. ఒకరిద్దరు నించుని వున్నారు. అందరి దగ్గిరా అందుబాటులో రివాల్వర్లు వున్నాయి.

టేబుల్‌కి ఇంకోపక్క ఒక ఖాళీ కుర్చీ వుంది.

రమణని టేబుల్ దగ్గిర నించోబెట్టి రక్షక భటులు ఒక అడుగు దూరంలో నిలబడ్డారు తుపాకుల్తో.

"కూర్చో" అన్నాడు ఎ. సి. పి. (అసిస్టెంట్ కమీషనర్. ఆఫ్ పోలీస్) రమణని ఎగాదిగా చూస్తూ.

కుర్చీలో కూర్చున్నాడు రమణ. చాలా మామూలుగా వుండటానికి ప్రయత్నిస్తున్నాడు. పరిసరాలు చూస్తున్నాడు. వైర్‌లెస్‌లో వార్తలు వొస్తున్నాయి. వినడానికి ప్రయత్నించాడు. ఏమీ అర్థం కాలేదు.

"నీ పేరేమిటి ?"

"వెంకట రమణ"

"ఏం గ్రూపు మీది?"

రమణ ఆశ్చర్యంగా చూశాడు. "కులం చెప్పాలా?" అన్నాడు నెమ్మదిగా.

"కులంగాదు. మీ గదిలో దొరికిన కాయితాలన్నీ ఏమిటి? నువ్వేం గ్రూపులో పని చేస్తున్నావు?"

"ఆ కాయితాల సంగతి నాకేం తెలీదండీ. అసలు నేనా గదిలో వుండను. నిన్నరాత్రే నా ఫ్రెండ్ దగ్గిరికి వొచ్చాను."

"మరి నువ్వెక్కడుంటావు!"

"మా పిన్నిగారింట్లో వుంటాను. ఈ వూళ్ళోనే."

రమణ చెప్పిన ఎడ్రస్ ఒక ఇనస్పెక్టర్ రాసుకున్నాడు.

"నీ ఫ్రెండ్ అంటే ఎవరు ?"

"ఇతనే. రాజారావు."

"అతనెలా ఫ్రెండు నీకు?"

"కాలేజీలో."

"ఏం చదివావు?"

"ఎం. ఏ."

ప్రశ్నలడిగే ఆఫీసర్ కొంచెం తటపటాయించాడు. "పిన్నిగారింట్లో ఎందుకుంటున్నావు ?"

"వుద్యోగం కోసం వెతకుతూ వున్నాను."

"యూ. జీ. లో ఎంతకాలం నించి వుంటున్నావు?"

రమణ తెల్లబోయాడు. "యూ. జీ. ఏమిటి? నేను మా పిన్నిగారింట్లో వుంటున్నాను.'

"అతి తెలివి ప్రదర్శించకు. నీలాంటివాళ్ళను చాలా మందిని చూశాం."

"నేను చెప్పేది నిజమో కాదో..."

"అదంతా మాకు తెలుసులే. నువ్వు చెప్పేదేదో తిన్నగా చెప్పు. అబద్ధాలాడితే మాకు తెలీదనుకోకు. తర్వాత అన్ని సంగతులూ వాకబుచేస్తాం."

"... ... ..."

"పాపం నిద్రమత్తులో లేపినట్టున్నాం సార్!" - అని ఇంకో ఇనస్పెక్టర్ ఎ. సి. పీ. తో అని నవ్వాడు.

"సరేలే! కొంచెం విశ్రాంతి తీసుకో!"

రమణ లేచాడు. రక్షక భటులు మళ్ళీ దడికట్టి రమణని లాకప్ దాకా తీసుకుపోయి లోపలికి గెంటి రాజారావుని బయటికి తీశారు.

టేబుల్ ముందు రమణ కూర్చున్న కుర్చీలో రాజారావు కూర్చున్నాడు.

"నీ పేరేంటి?"

"రాజారావు."

"మీరు ఏ గ్రూపు?"

"అలాంటిదేమీ లేదు నాకు."

"మరి ఆ కాయితాలసంగతేమిటి? అందులో రాతలన్నీ ఏమిటి?"

"వాటి గురించి నాకేం తెలీదండీ. మా ఫ్రెండ్ ఒకాయన ఆ కాయితాలన్నీ చూచుకుంటాడు. ఎప్పుడైనా కావాలంటే నన్ను టైపుచేసిపెట్టమని అడుగుతాడు. నేను జాబ్ వర్కు చేస్తూ వుంటాను."

"ఆ ఫ్రెండెవరు? అతని పేరు?"

"రామారావు."

"ఎక్కడుంటాడు?"

"తెలీదండీ."

"తెలీదా? నీ ఫ్రెండెక్కడుంటాడో నీకు తెలీదా? అసలు అతను నీకెలా పరిచయమయ్యాడు?"

"ప్రసాద్ అనే అయన రామారావుని పరిచయం చేశాడు!"

"ప్రసాద్ అంటే పి. ప్రసాదేనా?" ఆతృతగా మొహాలు ముందుకు వొంచారు- అడిగేవాళ్ళు.

"నాకు తెలిసింది పి. ప్రసాదే."

"ఇప్పుడెక్కడుంటున్నాడు అతను?"

"నాకు తేలీదండీ."

ఆఫీసర్లందరూ కూడబలుక్కున్నట్టు చాలా శాంతం వహించారు.

పి. ప్రసాద్ రెంపళ్ళ నించే యూ. జీ. లో వుంటున్నాడు. అతన్ని గురించి ఇంతవరకూ ఏమాత్రం సమాచారం దొరకలేదు. ఇప్పుడు తొందరపడి వీళ్ళకి కోపం తెప్పించి వ్యవహారం పాడుచేసుకోకూడదు.

"ప్రసాద్ నీకు రామారావుని పరిచయం చేసి ఎన్నాళ్ళయింది?"

రాజారావు కొంచెం ఆలోచించి—సరిగా గుర్తులేదు. ఆర్నెల్లవుతుందను కుంటాను" అన్నాడు.

"రామారావు ఎక్కడుంటున్నాడు?"

"తెలీదండీ"

"మరి నువ్వెప్పుడూ అడగలేదూ?"

"అడిగాను రెండు మూడుసార్లు. 'అలాంటి విషయాలు నీకు అనవసరం. అడక్కూడదు' అన్నాడు."

వినేవాళ్ళు కొంతసేపు మౌనం వహించారు.

"ప్రసాద్ ఎప్పుడెప్పుడూ కలుస్తూ వుంటాడు నిన్ను?"

"ప్రసాద్ ఏమయ్యాడో నాకు తెలిదు. ఎప్పుడైనా రామారావే వొస్తూ వుంటాడు."

"ఏం చేస్తాడు వొచ్చి ?"

"కాస్సేపు పుస్తకాలు చదువుకుంటాడు. అతని పుస్త కాలు నా రూమ్‌లో పెట్టుకుంటానన్నాడు. పెట్టుకోమ న్నాను."

"ఇంకా ఏం చేస్తూ వుంటాడు ?"

"నాకు ఇచ్చిన కాయితాలు టైప్ చేసి వుంచితే లెక్కచూసి డబ్బు ఇచ్చి అవి పట్టుకెళ్తారు."

"వెంకటరమణ నీతో ఎంత కాలం నుంచి వుంటు న్నాడు ?"

"నాతో వుండటంలేదు. వాళ్ళ పిన్నిగారింట్లో వుంటు న్నాడు. ఎప్పుడైనా నా దగ్గిరికి వొస్తూ వుంటాడు"

"ఈ సారి నీ దగ్గిరికి వచ్చి ఎన్నాళ్ళయింది ?"

"రెండు రోజులయింది."

"అతను నాలుగురోజులైందన్నాడే!"

"లేదండీ. అతనేమన్నా కంగారుపడి అలా అన్నా డేమో రెండు రోజులే అయింది."

"అసలు అతను నీకెలా పరిచయం ?"

"కాలేజీలో"

"క్లాస్‌మేట్సా మీరిద్దరూ ?"

"కాదు. ఒకసారి కాంటీన్‌లో పరిచయం అయింది. తర్వాత ఇద్దరం కలిసి పిక్చర్‌కి వెళ్లాం. అలాగే పరిచయం పెరిగింది."

ఎ. సి పి. కొంచెం సేపు మౌనంగా వూరుకున్నాడు.

"సరే కొంచెం సేపు రెస్టు తీసుకోండి" అని కుర్చీ లోంచి లేచాడు.

రాజారావు లేచాడు. రక్షక భటుల మధ్య నుంచి నడిచి లాకప్‌లో కొచ్చాడు.

రమణ ఆతృతగా రాజు మొహం చూడ్డానికి ప్రయత్ని స్తున్నాడు చీకట్లో. ఇద్దరూ బాగా మూల కూర్చున్నారు.

... నువ్వు మీ పిన్ని వాళ్ళింట్లో వుంటున్నట్టే చెప్పా లనుకున్నాం. అలాగే చెప్పావా ?"

"అలాగే చెప్పానే !"

"నా రూమ్‌కి వొచ్చి ఎన్నాళ్ళయిందన్నావు ?"

"రాత్రే వొచ్చా నన్నాను"

"నాలుగైదు రోజులైందన్నావని దబాయించారు వాళ్ళు. నువొచ్చి రెండు రోజులే అయిందన్నాను నేను నువ్వేం చెప్పావో తెలీక."

"మరి ఇప్పు డెలాగ ?"

"ఏదో చెప్పా, 'కంగారుపడి అలా చెప్పేడేమో' అన్నాను. 'నువ్వొచ్చి రెండు రోజులైందట కదా ? రాత్రే వొచ్చానన్నావేం?' అని వాళ్ళు మళ్ళీ నిన్ను అడిగితే 'భయ పడి అలా అన్నానండీ' అని చెప్పు. అది సరే మీ పిన్ని వాళ్ళ ఇంటి దగ్గిర వాకబు చేస్తే నువ్వు అక్కడే వుంటున్నట్టు చెపు తారుగా వాళ్ళు ?"

తప్పకుండా చెపుతారు. అలా చెప్పమని చాలాసార్లు చెప్పాను."

"నేనో పని చేశాను రమణా ! 'పి' మీదనుంచి వాళ్ళ దృష్టి మళ్ళించడానికి రామారావనే వ్యక్తిని సృష్టించాను."

"అంటే"

"రామారావనే ఆయనే నా దగ్గిరికి వొస్తూ వుంటాడన్నాను. ప్రసాద్‌తో నాకేం సంబంధం లేదన్నాను."

దుప్పట్లతో కట్టిన పుస్తకాల మూటలు వరండాల్లోంచి తీసుకు పోతున్నారు.

లోపల కంగారు కంగారుగా విప్పి చూస్తున్నారు,
పెద్ద కంఠాలతో మాట్లాడు కుంటున్నారు.
టెలిఫోన్లలో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నారు.

"...గ్రూపు అనుకుంటున్నాంసార్! చాలా అధారాలు కనబడుతున్నాయి."

"కాయితాలన్నీ చూశారా?"

"నో సర్! ఇంకా చాలా వున్నాయి"

"వాళ్ళేమైనా చెప్పారా?"

"నోసర్! ఇంకా ఏంలేదు."

"సరే! అన్నీ చాలా జాగ్రత్తగా వుంచండి."

"ఎస్ సర్!"

రాజారావు రమణా టెలిఫోన్‌లో వెళ్ళే మాటలు వినే ప్రయత్నం మానేసి తామిద్దరూ ఏ ఏ విషయాలలో జాగ్రత్తగా వుండాలో గబగబా చెప్పుకుంటున్నారు.

" .మర్చిపోయాను నీ జ్వరం ఎలాగుందీ?" అని రమణ రాజారావు వొళ్ళు తడిమి చూశాడు. చాలా వేడిగా ఉంది.

రాజారావు రాత్రి చొక్కాతోటే పడుకున్నాడు. అందుకే అతనికా చొక్కా దక్కింది.

"ఫర్వాలేదులే, పోలీసుల పీడ ముందు జ్వరం పీడ ఎంత?" అని నీరసంగా నవ్వాడు రాజారావు.

"మనం విషయాలేమయినా బయట పెడతామేమో నని మనవాళ్ళు కంగారు పడతారంటావా?"

"వాళ్ళ జాగ్రత్తలో వాళ్ళుంటారు. అలా వుండాలి కూడా. విషయాలేమీ బయట పెట్టకూడదని ఏదో ఆవేశంగా అనుకుంటే చాలదు. నిలబడ గలమో లేదో చూడాలి. మనం ఏం చేస్తామో మనకే తెలీదు ఇప్పుడు. నేను నిరుత్సాహ పడు తున్నా ననుకోకు సుమా? మనం చాలా దృఢంగా వుండాలనే నా వుద్దేశం."

ఒక కారువచ్చి ఆగింది వరండా ముందు.

ఇద్దరు స్పెషల్ బ్రాంచి ఆఫీసర్లు దిగి గబ గబా లోప లికి వెళ్లారు, పాత వాళ్ళూ కొత్తవాళ్ళూ అందరూ అతృతగా దుప్పట్ల మూటల్లో వున్న పుస్తకాలూ, కాయితాలూ పరిశీ లించారు. కొన్ని కాయితాలు ఒకరిచేతుల్లోంచి ఒకరిచేతుల్లోకి లాక్కుని ఆశ్చర్యంగా చూశారు.

"సందేహం లేదు" అనుకున్నారు. అందరి మొహాల మీదా చిరునవ్వుల్తో చాలా హుషారుగా వున్నారు.

ఇద్దరు ఇన్స్పెక్టర్లు లాకప్ దగ్గిరికి వెళ్ళి తాళం తీసి రాజారావుని బయటికి రమ్మన్నారు.

బయటికి వచ్చిన రాజారావు చుట్టూ పది మంది పోలీసులు నడిచారు.

రాజారావుని హాల్లోకి తీసుకువెళ్ళారు.

టేబుల్ చుట్టూ కూర్చున్న వాళ్ళల్లో ఇద్దరు కొత్త వాళ్ళు చాలా ఖరీదైన పేంట్లూ షర్టులూ వేసుకుని వున్నారు.

రాజారావు మళ్ళీ టేబుల్ దగ్గిర కుర్చీలో కూర్చున్నాడు.

టేబుల్ అంతా ఖాళీగా వుంది.

కొత్త ఆఫీసర్ దగ్గిర కొన్ని కాయితాలు వున్నాయి. రెండో ఆఫీసరు కొన్ని తెల్లకాయితాలు ముందు పెట్టుకుని రాసుకోడానికి సిద్ధంగా వున్నాడు.

"నీ పేరేమిటి ?"

"రాజారావు."

"ఏ గ్రూపు నీది?"

"అలాంటిదేం లేదండి నాకు"

"మీరు ఫలానా గ్రూపు అని కాయితాల్లో స్పష్టంగా తెలుస్తోంది."

"ఆ కాయితాలతో నాకేం సంబంధం లేదండీ."

"మరి ఎవరికి సంబంధం ?"

"మా ఫ్రెండ్ కాయితాలు అవన్నీ."

"అతని పేరేంటి ?"

"రామారావు."

"ఎక్కడుంటాడు?"

"తేలీదండీ."

ప్రశ్నలడిగే ఆఫీసరు కొంచెం వెటకారంగా నవ్వాడు - "ఎవరితో మాట్లాడుతున్నావో తెలిసే మాట్లాడుతున్నావా? నీ ఫ్రెండెక్కడుంటాడో నీకు తెలీదంటే మేం నమ్మాలా ?"

"నేను అడిగినా అతను చెప్పలేదు."

"ఇంకా ఎవరెవరు కలుస్తూ వుంటారు నిన్ను?"

"రామారావు తప్పితే ఇంకెవ్వరూ తెలీదునాకు."

"డాక్టర్ రమేష్ ఎక్కడుంటున్నాడు?"

"అతనెవరో నాకు తెలీదండీ."

"యాదవరాజు?"

"తెలీదండీ."

"సి. గోవర్ధన్?"

"తెలీదండీ."

"కె. బీ. ?"

"తెలీదండీ."

"మాలతీబాయి ?"

"తెలీదండీ."

"రాజ్యలక్ష్మి?"

"తెలీదండీ."

"మరేం తెలుసురా నీకూ లం... కొడకా!" వెనకనించి పెద్ద చరుపు రాజారావు మెడమీద. కుర్చీ వెనక నిలబడ్డ ఆఫీసరు తన కర్తవ్యం నిర్వహించాడు.

రాజారావుని అడిగిన ప్రశ్నల్లో ఒక్క గోవర్ధన్ తప్ప మిగిలిన వాళ్ళెవరూ తెలీదు రాజారావుకి. గోవర్ధన్ గురించి అయినా ఆ గోవర్ధన్ తనకు తెలిసిన గోవర్ధన్ అయితే అతన్ని

ఏ గ్రూపు కార్యక్రమాల్లో వుంటాడో తెలుసుగానీ, అంతకు మించిన వివరాలేమీ తెలీదు.

"తెలీదు", "తెలీదు" అనకపోతే వాళ్ళడిగిన ప్రశ్నల్లో నిజానికి యేం తెలుసు రాజారావుకి ?

రాజారావు మెడమీద ఎంత దెబ్బ పడ్డా తలతిప్ప కుండా కూర్చున్నాడు.

"నువ్వేం చేస్తున్నావు?"

"ఎం. ఏ. అయింది. రిసర్చి చేస్తున్నాను."

"యు. జీ. లో వుండి రిసర్చి ఎలా చేస్తున్నావు?"

"నేను యూ. జీ. లో లేను. నా గురించి మా డిపార్టు మెంటులో తెలుసుకోవచ్చు."

"మరి అంత రహస్యంగా మారుమూల గది ఎందుకు తీసుకున్నావు?"

"మంచి పోర్షన్ ఇంకెక్కడా దొరకలేదు. అద్దె చవక అక్కడ. చదువుకోడానికి బాగుంటుందని .. "

"యూ. జీ. వాళ్ళని కలుసుకోడానికి కూడా బాగుం టుందని. ఏం?"

"... ... ..."

"ఇదిగో చూడు. మీరు చాలా తెలివైనవాళ్ళని మాకు తెలుసు. అతితెలివి ప్రదర్శిస్తే నష్టపోయేది మీరే. పెద్ద పెద్ద చదువులు చదువుతారుగానీ ఇంత తెలివి తక్కువగా జీవితాలు ధ్వంసం చేసుకుంటారెందుకు? మీలాంటి వాళ్ళకు ప్రభుత్వం కళ్ళకద్దుకుని ఉద్యోగాలిస్తుంది, హాయిగా వుద్యో గాలు చేసుకుంటూ పెళ్ళాం బిడ్డలతో... "

రాజారావు వైర్లెస్‌లో వార్తలు వినడానికి ప్రయత్ని స్తున్నాడు.

టెలిఫోన్ మోగింది. ఒక ఇనస్పెక్టర్ గబగబా వెళ్ళి రిసీవర్ తీసి మాట్లాడుతున్నాడు. అదేమిటో కూడా వినాలని ప్రయత్నిస్తున్నాడు రాజారావు తలతిప్పకుండా.

"ఈ కాయితాల్లో రైటింగ్ ఎవరిది?" రాజారావు ముందు ఐదారు కాయితాలు పెట్టారు. అందులో కొన్ని రాజారావు రాసినవే. రాజారావు ఇంకో రకంగా కూడా రాయగలడు. కాయితాలన్నీ చూసి నాకు తెలీదండీ" అన్నాడు.

"నీకు తెలీకుండానే ఈ కాయితాలు నీ రూమ్‌లో కెలా వచ్చాయి?"

"మా ఫ్రెండ్ తెచ్చి టైపు చెయ్యడానికిచ్చాడు."

"ప్రతీ విషయం ఫ్రెండ్ మీదికి తోసేస్తే సరిపోతుం దనుకుంటున్నావా? నీ జవాబులన్నీ నమ్మేస్తున్నాం అను కోకు. ఈ కార్యక్రమా లన్నిటితోటీ మీ ఇద్దరికీ సంబంధం వుంది. మీరు ఎంత తప్పించుకోవాలని చూసినా లాభం లేదు. నీకు తెలిసిందేదో చెప్పడం మంచిది."

"... ... ..."

"అసలు నువ్వి రాజకీయాల్లో కెలా దిగావు ?"

"రాజకీయాల్లాంటివి నాకేం తెలీవండీ."

"యూ. జీ. వాడికి సహాయం చెయ్యడం రాజకీయం కాదా ?"

"అతను నాతో స్నేహంగా వుంటున్నాడు కాబట్టి చేసి పెట్టమన్న పని చేస్తున్నాను."

"స్నేహితుడు చెప్తే ఎంత దేశద్రోహమైనా చేస్తావా?"

"దేశద్రోహం ఎందుకు చేస్తాను? అలాంటి పని ఎవరు చెప్పినా చెయ్యను."

"మరి నీ ఫ్రెండ్ నీతో చేయించేది దేశద్రోహం కాకపోతే ఏమిటి? ప్రజల్ని రెచ్చగొట్టే కరపత్రాలు టైప్ చేసి ఇచ్చావు. అందులో రాసిందేమిటో అర్థంచేసుకున్నావా?"

రాజారావు ఒక్క క్షణం ఆగాడు.

"అందులో దేశద్రోహం వున్నట్టు నాకేం అనిపించ లేదు. ప్రజల కెన్నో సమస్యలున్నాయని అందరికీ తెలుసు. వాటికేవో పరిష్కార మార్గాలు చెపుతూ తమకు తోచిన విధంగా..."

ప్రశ్నలడుగుతోన్న ఆఫీసర్ మండిపడిపోతూ చేతిలో రూళ్ళకర్రతో టేబుల్‌మీద పెద్ద దెబ్బ వేశాడు- "ప్రజల సమస్యల్ని పరిష్కరించడానికి ప్రభుత్వం లేదా? ఎందుకు వుంది ప్రభుత్వం? ప్రభుత్వాన్ని కాదని ప్రజల సమస్యలు మీరు పరిష్కరిస్తారా?"

"ఎవరూ పరిష్కరించరు. ప్రజల సమస్యలు ప్రజలే పరిష్కరించుకుంటారు."

"ఓహో! విప్లవసారం బాగానే ఒంటపట్టింది. మరి రాజకీయం తెలియదంటావేం?"

"ఇవేనా రాజకీయాలంటే?" అన్నాడు రాజారావు ఆశ్చర్యంగా.

ఆఫీసర్లు తెచ్చిపెట్టుకున్న శాంతం ప్రదర్శిస్తున్నారు.

రాజారావుతో వీలైనంత నేర్పుగా ప్రవర్తించాలని ఒకరి నొకరు చూపులతో హెచ్చరించుకుంటున్నారు.

ఒక ఆఫీసర్ సిగరెట్ వెలిగించుకోబోతూ రాజారావు కొకటి ఇవ్వబోయాడు.

"అవసరం లేదు" అని రాజారావు పోలీసు మర్యాదని తిరస్కరించాడు.

అంతవరకూ అక్కడక్కడా నిలబడి పచార్లు చేస్తున్న ఆఫీసర్ వొచ్చి ఒక కుర్చీలో కూర్చున్నాడు.

"చూడండి రాజారావుగారూ! ఎందుకీ ముసుగులో గుద్దులాట?... పోనీ మీ కేం తెలుసో అంతవరకే చెప్పండి... మా డ్యూటీ మేం చెయ్యాలికదా! దేశరక్షణ మా కర్తవ్యం. మీలాంటి యువకులెందరో తప్పుడు దారులు పట్టి నాశనం అయిపోతున్నారు. మీలాంటి అమాయకుల్ని నయాన్నో, భయాన్నో సరైన మార్గంలో పెట్టటం, దేశాన్ని కాపాడటం మా ధర్మం. చదువూ సంధ్యా లేని మూర్ఖుడికయితే "వోరే! నువ్వింత తప్పుదారి పట్టావురా" అని చెప్పాలిగానీ మీలాంటి వాళ్ళకు చెప్పటం ఎందుకు? మీరే గ్రహించుకోవాలి.

రాజారావు కదలకుండా, చూపు తిప్పకుండా కూర్చుని వింటున్నాడు.

వీళ్ళు "దేశరక్షణ" చేస్తారట! దేశరక్షణ! ఎంత నవ్వులాట విషయం!

"మీరు చేసేది ఎవరి రక్షణో మాకు తెలుసులేండి" అంటే ?

"మీ నక్కజిత్తులు మాకు కొత్తగాదులెండి" అంటే?"

అనేక సందర్భాల్లో తమ జాగ్రత్తకోసం "పై వాళ్ళు" చేసిన హెచ్చరికలు గుర్తు వస్తున్నాయి.

"ఎప్పుడైనా పోలీసులకి పట్టుబడితే చాలా ధైర్యంగా నిలబడాలి. ముక్తసరిగా ఎంతవరకు అడిగితే అంతవరకే సమాధానం ఇవ్వాలి. పోలీసులు మిమ్మల్ని చాలా రకాలుగా రెచ్చగొట్టో, ఆశపెట్టో, అవమానాలు చేసో సమాచారం సేకరించాలని ప్రయత్నిస్తారు. ఎప్పటికప్పుడు వాళ్ళ ఎత్తుగడలు అర్థంచేసుకోవాలి. వీలైనంతవరకూ శాంతంగా వుండడానికే ప్రయత్నించాలి గానీ ఆవేశంగా రొమాంటిక్‌గా ప్రవర్తించకూడదు. దానివల్ల మళ్ళీ బయటపడే అవకాశాలు తగ్గిపోవచ్చు. మీరు నమ్మిన వుద్యమానికి ద్రోహం చెయ్యకుండా పోలీసుల నించి బయటపడే మార్గం చూసుకోవాలి. ఎంతసేపూ మీ దృష్టి దానిమీదే వుండాలి."

రాజారావు చాలా ముక్తసరిగా వుండడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఆఫీసర్లు నలుగురైదుగురు ఎవరి బాధ్యత వారు నిర్వర్తిస్తున్నారు.

"అరెస్టయిన తర్వాత ఇక మీరు దాచి ఏమీ లాభం లేదు. ఎన్నాళ్ళు చెప్పకుండా వుండగలరు? అనవసరంగా మీకు శ్రమ. మాకు శ్రమ."

"మీరెంత దాచాలనుకున్నా లాభంలేదు. మీతో ఎలా చెప్పించాలో మాకు తెలుసు."

"అన్నీ చెప్పక్కర్లేదు. అసీ చెప్పమని మేమంటు

న్నామా? రామారావు ఎక్కడుంటాడో చెప్పు. లేకపోతే ప్రసాద్ ఎక్కడుంటాడో చెప్పు."

"వాళ్ళిద్దరూ కాకపోయినా ఫర్వాలేదు. యూ. జీ. వాళ్ళల్లో ఎవర్నో ఒకర్ని గురించైనా చాలు."

"రామారావెక్కడుంటాడో నీకు తప్పకుండా తెలుస్తుంది. తెలీదూ?"

"పోనీ ఆ సంగతులన్నీ వొదిలెయ్. వీరా కేంద్రకమిటీ సభ్యులెవరెవరో చెప్పు."

ప్రశ్నలు నాలుగు వేపుల్నించీ ముసురుతున్నాయి.

రాజారావు ఎంత శాంతంగా వుండాలని ప్రయత్నించినా కోపం వొస్తోంది. ఒక్క ప్రశ్నకు కూడా జవాబు చెప్పకుండా తనకు పట్టనట్టు కూర్చున్నాడు.

"అన్నీ ఇప్పుడే చెప్పాలని కాదు. నీ కిష్టమైనప్పుడే చెప్పు. తొందరగా చెప్పేస్తే తొందరగా బయట పడతావు. తెలిసో తెలియకో ఈ గొడవల్లో దిగినట్టున్నావు. ఇంకా సీరియస్ చేసుకోటం తెలివైన పనికాదు... సరే! వెళ్ళు"

రాజారావు లేచాడు. మళ్ళీ లాకప్‌లో కొచ్చాడు. గది మూలకు చేరి నెమ్మదిగా చిన్న కంఠంతో తనని అడిగిన ప్రశ్నలన్నీ రమణకు చెప్పాడు.

"మనం చెప్పే మాటలు ఒక్కటి కూడా వాళ్ళు నమ్మడంలేదు, వాళ్ళని నమ్మించగలమని మనం అనుకో కూడదు. వాళ్ళు నమ్మినా, మానినా మనం చెప్పవలసింది మాత్రం అంతే. అంతకన్నా ఏం లేదు. మన కేంద్ర కమిటీ

సభ్యులెవరో వాడికి చెప్పాలట! మనకు తెలీదంటే వాళ్ళు నమ్ముతారా? నిజం చెప్పాలంటే మనకు తెలుసునా? నాకు తెలీని వాళ్ళెవర్ని గురించో ఒక డజన్‌మందిని గురించి అడిగారు. వాళ్ళందరూ ఎవరెవరో, ఎక్కడెక్కడున్నారో, ఎంతెంత రహస్య కార్యకలాపాలు చేస్తున్నారో అన్నీ మనకు తెలుసని, మనం దాచేస్తున్నామని వాళ్ళ నమ్మకం. ఇంకా రేపట్నించీ మనకు తేలీనివి ఎన్ని అడుగుతారో!

రమణా! మనం మనవాళ్ళందరితో కలిసి వున్నప్పుడు మనకేమీ ఇబ్బంది లేకుండా అంతా సాఫీగా జరిగిపోతున్నప్పుడు ధైర్యంగా వుండడం కాదు. ఇలాంటి సమయాల్లోనే ధైర్యంగా నిలబడాలి. తెల్లారితే మనిద్దర్నీ కలిపి వుంచుతారో లేదో తెలీదు, అసలు మనం ఎన్ని నెలలకి బయట పడతామో తెలీదు. విడుదలయ్యేదాకా మనం మళ్ళీ కలవకపోయినా సరే. ఎంతవొంటరిగా నైనాసరే మనంమన లక్ష్యంమీదే మన శక్తులన్నీ కేంద్రీకరించుకుని నిలబడాలి.

మనకన్నా ముందుకాలాలలో పుట్టిన ప్రజలు ఎన్నెన్నో సాహసాలు చెయ్యబట్టే మనం ఈనాడు ఈ మాత్రపు ప్రజాస్వామ్యంలో వున్నాం. బానిస వ్యవస్థలో బానిసలు ఏ సాహసాలు చేయకుండా కిక్కురుమనకుండా అన్నీ భరిస్తూ పడివుంటే మానవ సమాజం ఈనాటికి ఇంకా బానిస వ్యవస్థలోనే వుండేది. వెనకటి ప్రజల త్యాగ ఫలితాలు మనం అనుభవిస్తూ మనం కూడా సమాజంకోసం ఏమీ చెయ్యకుండా జీవించడానికి మనకు అర్హత లేదు. సమాజ భవి

ష్యత్తు మరింత ఉన్నతంగా మరింత సుందరంగా తయారవడా నికి మనకు చేతనైన ప్రయత్నం మనం చెయ్యాలి."

రాజారావు చెప్పేదంతా శ్రద్ధగా వింటున్నాడు రమణ. ప్రతీ మాటనీ ఆతృతగా లోపలికి తీసుకుంటూ వింటున్నాడు.

* * *

లాకప్ బయట లోకం అంతా తెల్లవారింది. పరిసరాలు వివరంగా తెలుస్తున్నాయి. వరండాలో ఒక పక్కనుంచీ కాంపౌండ్‌లో చెట్లు కనబడుతున్నాయి. చెట్లమీదనించి ఒక్క పక్షి అరుపు లేదు. ఆ చెట్లమీద పక్షులే వున్నట్టు లేవు. పోలీసుల తుపాకుల్నీ, వాళ్ళ బూట్ల నడకల్నీ చూసి పక్షులు ఆ చెట్లు వొదిలేసినట్టున్నాయి,

నలుగురు జవాన్లు లాకప్ ముందు తుపాకులతో తగి నంత జాగ్రత్తలో ఉండగా ఒక జవాను లాకప్ తాళం తీసి ఒక రేకు బక్కెట్టుతో కాసిన్ని నీళ్లు లోపల పడేశాడు.

"పళ్లు తోముకునే పుల్లలు కావాలి" అన్నాడు రమణ.

"అయ్యేం లేవు. కానివ్వండ్" అని జవాను బయటికి పోయి మళ్ళీ తాళం పెట్టేశాడు.

"దేవుడు ఐదేసి వేళ్ళిచ్చాడు ఒక్కో చేతికి. కానియ్యి" అంటూ లేచాడు రమణ.

"వీళ్ళు అప్పుడే మనకు నీళ్ళిచ్చారంటే మనల్ని అపార మైన "ప్రేమతో" చూస్తున్నారన్నమాటే, పాపం మన మీద చాలా ఆశలు పెట్టుకున్నట్టు వున్నారు."

ఇద్దరూ గదిమూల తూము దగ్గిర మొహం కడిగే కార్యక్రమం ముగించారు,

రమణ తలుపు దగ్గిరికి వెళ్ళి అక్కడ వున్నవాళ్ళతో "నేను దొడ్డికి వెళ్ళాలి" అన్నాడు!

"అదేం కుదరదు" అని గాభరాగా తలతిప్పేశాడొక జవాన్.

"కుదరదంటే? ఏం చెయ్యమంటావు?" అని కోపంగా అడిగాడు రమణ.

ఆ జవాన్ ఇంకో జవాన్‌ని పిలిచి సంగతి చెప్పి "సార్‌ని అడిగిరా" అని చెప్పి పంపించాడు.

వెళ్ళిన జవాను పావుగంటకి బయటకి వొచ్చాడు. చేతిలో సంకెళ్ళు పట్టుకు వచ్చాడు. అతనివెంట నలుగు రైదుగురు జవాన్లూ, ఒక ఇనస్పెక్టరూ వచ్చారు. జవాన్లం దరూ తుపాకులు సర్ది పెట్టుకుని లాకప్ తలుపులు తీశారు.

రమణ కుడిచేతికి గొలుసు వేశారు.

"జాగ్రత్త! పారిపోవాలని ప్రయత్నించావో షూట్ చేసి పారేస్తాం" అని పిస్తల్ చూపిస్తూ కోపంగా హెచ్చరిం చాడు ఇన్‌స్పెక్టర్.

రమణని బయటికి తీసి లాకప్ మళ్ళీ మూశారు. రమణ చుట్టూ పోలీసులు నడుస్తూ అతన్ని దొడ్డి దగ్గరికి తీసుకు వెళ్లారు,

రమణతోపాటే ఒక పోలీసు గొలుసు పట్టుకొని దొడ్లోకి వెళ్లాడు.

"నువ్వు బయటికి వెళ్ళు" అన్నాడు రమణ.

"అలా వొప్పుకోడు సారు. నేనిక్కడే వుండాలి" అన్నాడు జవాన్,

రమణ కోపంగా- "ఇక్కణ్ణించి ఎలా పారిపోతాననుకుంటున్నారు?" అని అరిచాడు.

"గల్లంతు చెయ్యకు, కూర్చుంటే కూర్చో, లేకపోతే పద" అని తేల్చేశాడు జవాన్,

రమణ బయటికివచ్చి ఇన్స్పెక్టరుతో పోట్లాడదామనుకున్నాడు. కానీ మళ్ళీ అది చాలా దండగ అనుకున్నాడు. అలాగే చీదరించుకుంటూ, మండిపడుతూ కూర్చుని బయట పడ్డాడు.

రమణని మళ్ళీ లాకప్‌లో వేశాక రక్షక భటులందరి ప్రాణాలు కుదుట పడ్డాయి,

సుమారుగా ఎనిమిది గంటల ప్రాంతంలో రెండు కార్లు వచ్చాయి. నలుగురైదుగురు బూట్లవాళ్ళు వుత్సాహంగా మాట్లాడుకుంటూ లాకప్ తలుపులు తీసి రాజారావుని బయటకు తీసుకువెళ్లారు.

"ఈ సారి అక్కడ ఖాళీ కుర్చీలేదు.

రాజారావు టేబుల్ దగ్గర నిలబడ్డాడు.

టేబుల్ చుట్టూ కూర్చున్నవాళ్ళల్లో ఇద్దరు మాత్రమే పాతవాళ్ళు వాళ్ళిద్దరూ యూని ఫారాల్లో వున్నారు.

టేబుల్ మీద రెండు మూడు రివాల్వర్లు వున్నాయి. జవాన్లెవరూ గదిలో లేరు. గది తలుపులు మూసేశారు.

ఒక పొట్టి ఆఫీసరు రాజారావుని ఎగాదిగా చూస్తూ అన్నాడు- "నువ్వు నిజం చెప్పాలి. తెలిసిందా? లేకపోతే లాభంలేదు."

ఇంకో ఆఫీసరు ప్రశ్నలు ప్రారంభించాడు,

"అసలు నువ్వీ రాజకీయాల్లోకి ఎలా దిగావు?"

"నాకు రాజకీయాలేవి తెలీవండీ"

"పోనీ ఈ కార్యక్రమా ల్లోకి ఎలా వచ్చావు?"

"ఏ కార్యక్రమాలు ...?"

"అదే యూ. జీ వాడితో స్నేహం. అతనికి సహాయం చేసి పెట్టడం ... ఇలాంటి పనులంటే నీకెలా అసక్తి కలిగింది మొదట?"

"నేను బి. ఏ, లో వున్నప్పుడు నా ఫ్రెండ్స్ కొందరు వెల్ఫేర్ హాస్టల్లో వుండేవాళ్ళు.

అక్కడ వాళ్ళకి సరైన సౌకర్యాలు వుండేవి కావు. సరిపోయేన్ని బాత్ రూమ్‌లూ, లెట్రిన్‌లూ వుండేవి కావు. రెగ్యులర్‌గా నీళ్లువచ్చేవి కావు. ప్రభుత్వం స్టూడెంట్స్ కోసం ఇచ్చే గ్రాంట్లు సరుపోయేవి కావు. ధరలు పెరిగినా గ్రాంట్లు పెంచేవాళ్లు కారు... అలాంటి ఇబ్బందులన్నీ మా ఫ్రెండ్స్ చెబుతూ వుండేవాళ్లు. ఒకసారి వెల్ఫేర్ హాస్టల్ స్టూడెంట్సంతా సమ్మె చేశారు. ఆ సమ్మెకి సానుభూతిగా మా కాలేజీ స్టూడెంట్స్ కూడా సమ్మె చేశారు. మా కాలేజీ నించి చాలామంది స్టూడెంట్స్ వెల్ఫేర్ హాస్టల్‌కి వెళ్ళారు. అక్కణ్ణించి అందరూ కలిసి కలెక్టర్‌కి మెమోరాండం సమర్పించడానికి వెళ్ళారు. అప్పుడే నాకు కొంచెం స్టూడెంట్స్ సమస్యల గురించి ఆలోచించడం తెలిసింది."

"ఆ సమ్మెలో నువ్వుకూడా వున్నావా?"

"వున్నాను."

"ఏమైంది సమ్మె?"

"ఏమీ కాలేదు. పోలీసులు చాలా అన్యాయంగా స్టూడెంట్స్‌ని లాఠీలతో కొట్టారు. అరెస్టులు చేశారు, స్టూడెంట్స్ చెప్పుకున్న ఇబ్బందుల గురించి మాత్రం ఎవ్వరూ పట్టించుకోలేదు."

"ఆ సమ్మెలో చురుగ్గా పనిచేసినవాళ్ళెవరెవరు?"

"ప్రతి స్టూడెంటూ చురుగ్గానే ఉన్నాడు అందరూ ఒక్కలాగే వున్నారు."

ఆఫీసర్లు ఒకరి మొహం లొకరు చూసుకున్నారు- "వీడు చాలా తెలివి ప్రదర్శిస్తున్నాడయ్యా" అనే అర్థంతో.

"సరే. తర్వాత? ఆ సమ్మెవల్లనే రాజకీయాల్లో ఆసక్తి వచ్చిందా నీకు?" ఒక ఆఫీసరు రాజారావుని అడుగుతూ వుండగానే ఇంకో ఆఫీసరు పక్కవాడితో అంటున్నాడు— "వీళ్లు నెమ్మదిగా ఇలాంటి సమ్మెల్లోంచే బయల్దేరతారు సార్! గుర్తుందా మీకు? మొన్నటి వాళ్ళు కూడా ఇలాగే చెప్పారు."

"చెప్పు. ఆ సమ్మె జరిగినప్పట్నించేనా నువ్వు రాజకీయాల్లోకి దిగింది?"

"రాజకీయాలంటే నా కిప్పుడూ సరిగ్గా తెలీదు. స్టూడెంట్స్ సమస్యల మీద ఎప్పుడైనా ఎక్కడైనా మీటింగులు జరిగితే వెళ్ళేవాళ్ళం. ఒకసారి బస్సు రేట్లు బాగా పెరిగిపోతే స్టూడెంట్సంతా చాలా ఆందోళన చేశారు.

"ఆందోళనంటే?"

"పెద్ద మీటింగు జరిగింది."

"ఏవరెవరు మాట్లాడారందులో?"

"చాలామంది మాట్లాడారు. ప్రసాద్ అనే ఆయన నాకా మీటింగులోనే పరిచయం అయ్యాడు."

"నీకు రామారావుని పరిచయం చేసిన ప్రసాదేనా?"

"అవును."

"అతనుకూడా మాట్లాడాడా మీటింగులో?"

"మాట్లాడాడు."

"ఏం మాట్లాడాడు?"

"విద్యార్థులంతా ఐక్యంగా వుంటే ఎలాంటి సమస్యలైనా పరిష్కరించుకోవచ్చు నన్నాడు. ఐక్యతకి మించిన శక్తి లేదన్నాడు. స్టూడెంట్సంతా ఐక్యంగావుండి ఆందోళన చెయ్య బట్టే అప్పుడు బస్సు రేట్లు తగ్గించారు."

పోలీసువాళ్ళేదో ఘోరం జరిగినట్టు చూస్తున్నారు.

"ప్రసాద్ విద్యార్థుల సంఘం ఒకటి నడిపించాడు. అందులో నువ్వు మెంబరుగా వున్నావా?"

"వున్నాను."

"ఏం పనులు చేసేవాడివి?"

"విద్యార్థుల పేపరు అమ్మడం, ఎప్పుడైనా కర పత్రాలు పంచడం"

"అసలు ఇలాంటి సంఘాల్ని మొగ్గలోనే తుంచె య్యాలి సార్!" అన్నట్టు చూసుకుంటున్నారు వాళ్ళు, ఒకళ్ళ నొకళ్లు.

"ప్రసాద్ ఇప్పుడు ఎక్కడ వుంటున్నాడు?" మళ్ళీ పాత ప్రశ్న.

"నాకు తెలీదు. రామారావుని పరిచయం చేసిన తర్వాత నాకు మళ్ళీ అతను కనపడలేదు."

"రామారావు ఎక్కడుంటాడు?"

"అదికూడా తెలీదు. చెప్పలేదతను.

ప్రశ్న లడిగే ఆఫీసరు విశ్రాంతిగా వెనక్కి వాలాడు-

స్టూడెంటుగా వున్నప్పుడు స్టూడెంటు వ్యవహారాల్లో తిరిగావు, సరే. తర్వాత నీకీ రాజకీయాలన్నీ ఎందుకు ? స్టూడెంటు సమస్యలు వదిలేసి ఇప్పుడు ప్రజల సమస్యలు పరిష్కరించడానికి పూనుకున్నావా?"

" ... ... ..."

"నీ రూమ్‌లో కమ్యూనిస్టు పుస్తకాలు చాలా వున్నాయి. చాలా వాటిమీద నీ పేరుకూడా వుంది. నువ్వు పచ్చి కమ్యూనిస్టు వనీ, దేశద్రోహం చేస్తున్నావనీ మేమెందుకనుకోగూడదు?"

"కమ్యూనిస్టు సాహిత్యం పబ్లిగ్గా బజార్లో అమ్ముతున్నారు. కొనుక్కున్నాను. అందులో నేను చేసిన ద్రోహమేమిటి ?"

"బజార్లో ఇంకా చాలా అమ్ముతున్నారు, ఒక్క సెక్స్ పుస్తకం కూడా లేదేం నీరూమ్‌లో"

"వాటి మీద నాకిష్టంలేదు. నాకు ఇష్టమైనవి నేను కొనుక్కున్నాను."

"ప్రజల్ని రెచ్చగొట్టే పుస్తకాలే నీ కిష్టమయ్యాయిరా?" అని అరిచాడా కొడుకు వెకిలించి.

"లెనిన్ అంత విప్లవకారుడు లెండి" నవ్వులు కొందరు.

"ఇదిగో చూడు. నువ్వే చాలా తెలివిగలవాణ్ణి అనుకుంటున్నావు. నీ వ్యవహారం అంతా మాకు తెలుసు. నువ్వు "... ...గ్రూపువాడివి. ఆ గ్రూపు వాళ్ళతో నీకు సంబంధాలున్నాయి, అంతా మాకు తెలుసు.

"అంతా మీకు తెలిస్తే నన్నడగడ మెందుకూ?"

పెద్దదెబ్బ కర్రతో భుజంమీద.

రాజారావు కోపంతో పెద్ద కేక పెట్టబోయి కేక ఆపుకున్నాడు ఆశ్చర్యంగా.

"ఇప్పటిదాకా చాలా ఓపిగ్గా ఉన్నాంరా నీతో! ఎవడి విషయంలోనూ ఇంత టాలరేట్ చెయ్యలేదు తెలుసా? అడిగిందానికి తిన్నగా చెప్పు, లేకపోతే ఎలా చెప్పించాలో తెలుసు మాకు."

"... ... ..."

"రామారా వెక్కడుంటాడు?"

"తెలీదు."

"ప్రసాద్?"

"తెలీదు."

"డాక్టర్ రమేష్?"

"తెలీదు."

"కె. బీ. ?"

"ఆ పేరే వినలేదు నేను."

గబగబా వర్షంలాగ దెబ్బలు పడ్డాయి రాజారావు భుజంమీద.

రాజారావు నిలబడలేక టేబుల్ అంచులు గట్టిగా పట్టుకున్నాడు.

వేళ్ళమీద కర్రదెబ్బలు పడ్డాయి.

"నీలాంటి లం... కొడుకుల్ని దారి కెలా తేవాలో మాకు తెలుసురా! నీ నాలుగూ నీకు మొదటే వడ్డిస్తే ఈ పాటికి దారికొచ్చేవాడివే. ఎలాగుంది- బాగుందా?" కర్ర దెబ్బలు పడుతూనే వున్నాయి మెడమీదా భుజాలమీదా.

అంతదాకా అందర్లాగే కూచున్న ఒక పొడుగువాడు లేచి దెబ్బలు కొట్టేవాడి చేతిలోంచి కర్రలాగేస్తూ -

"ఏంటండీ అంతకోపం మీకూ? అతను చాలా చిన్నవాడు ఏదో తెలిసో తెలీకో ఈ గొడవల్లోకి దిగినట్టున్నాడు. అంత మాత్రానే తొందర పడి చెయ్యి చేసుకుంటారా?" అంటూ దెబ్బలు కొట్టిన వాణ్ణి మందలించాడు.

"దెబ్బలు కొట్టినవాడు "తొందరపడ్డానే" అని పశ్చాత్తాప్పడుతున్నట్టు మొహం పెట్టాడు.

పొడుగు ఆఫీసరు రాజారావుని ఓదార్పుగా చూస్తూ--"చూడు మిస్టర్ రాజారావ్ ! ఇది చాలా చిన్న విషయం ఏం అనుకోకు. టేకిట్ ఈజీ, వెళ్ళు. వెళ్ళి కొంచెం రెస్టు తీసుకో." అని చేతిలో కర్ర టేబుల్‌మీద పడేశాడు.

రాజారావు వెళ్ళగానే రమణ వచ్చాడు.

రమణ కొత్తగా చెప్పిందేమీ లేదు.

అంతా మొదటిసారి చెప్పినట్టే చెప్పాడు.

పొడుగు ఆఫీసర్‌కి ఏదోగుర్తు వచ్చినట్టు ఆ స్టేషన్

ఇన్‌స్పెక్టర్ని చూసి—"వీళ్ళిద్దర్నీ వేరే వేరే వేశారా? అని యాదాలాపంగా అడిగాడు

"ఇన్‌స్పెక్టర్ కంగారు పడ్డాడు. జవాబు చెప్పటానికి ధైర్యం చాలనట్టు ఏదో గొణిగాడు.

"ఏంటి ? ఒక్కదాంట్లో వేశారా?"... అని ఇంకో ఇద్దరు స్పెషల్ బ్రాంచి ఆఫీసర్లు నమ్మలేనట్టు ఆశ్చర్యంగా అడిగారు.

"రాత్రి జవాన్లు చాలా తక్కువమందున్నారు సార్!" అని ఏదో నసగబోయేడు ఇన్‌స్పెక్టరు.

"ఎవడయ్యా మీకు చెప్పింది ఇడియట్స్" అని మండి పడి పోయాడు. పొడుగువాడు రాత్రి దాడిలో వున్న స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టరిద్దర్నీ బూతులు తిట్టాడు. అప్పటి కప్పుడు వాళ్ళని ఫోన్‌మీద పిలిచి— "గాడిదల కుండే బుద్ధన్నా లేదా మీకు?" అని తిట్లవర్షం కురిపించాడు, అక్కడవున్న ఆఫీసర్లం దరిలోకి ఆ పొడుగువాడే పెద్దవాడని రమణ అర్థం చేసుకున్నాడు.

రమణని తీసుకుపోయి పాత లాకప్‌లోవేసి రాజారావుని తీసి వేరేగదిలో పెట్టించాడు ఇన్‌స్పెక్టర్. ఒక అర గంటలో పొడుగు ఆఫీసరు రాజారావు దగ్గిరికి వచ్చాడు. తలుపుల దగ్గిర నిలబడి రాజారావుని నవ్వు మొహంతో చూశాడు జేబులో పిస్టల్ మీద చెయ్యి పెట్టుకుని గుమ్మం లోపల అటూ ఇటూ పచార్లు చేశాడు.

"మిస్టర్ రాజారావ్ !"

"మీ నాన్నగారికి ఈ వ్యవహారాలన్నీ తెలుసునా?"

"రాజారావు నిర్లక్ష్యంగా వూరుకున్నాడు.

"నువ్వుచేసే పనులన్నీ మీ నాన్నగారికి తెలుసునా అని"

"తెలుసు"నన్న ధోరణితో వూరుకుంటే ఇక ఆ "నాన్న"ని పట్టుకుని "నువ్వే ఈ పనులన్నీ చేయిస్తున్నావురా" అని ఆ వ్యక్తిని పీడిస్తారని రాజారావుకి తెలుసు.

"నేను చేసుకునే పనులన్నీ మా నాన్నకు తెలియవలసిన అవసరం ఏమిటి?" అన్నాడు మొహం చిట్లిస్తూ.

"అంతేనా? ఈ కాలం పిల్లలు చాలా చెడిపోయారోయ్. తల్లి లేదు, తండ్రిలేదు. అంతా వాళ్ళిష్టమే నవమాసాలు మోసి కనిపెంచి విద్యాబుద్ధులు చెప్పించి వృద్ధిలోకి తెస్తే ...చివరికి ఇదీ వరస. చేతికందిన పిల్లలు ఇలాగైపోతే పాపం మీతల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఎంత దుఃఖిస్తారో ఆలోచించరేం మీరు?"

"... ... ..."

"అసలు మీస్వస్థలం ఎక్కడ?"

"మాకు స్వస్థలాలేమీ లేవు. ఎక్కడుంటే అక్కడే మా స్వస్థలం. ప్రస్తుతం ఈ కలకటాలే నా స్వస్థలం."

పొడుగువాడు నవ్వాడు. తన మనసంతా వెన్నపూసంత మెత్తన అన్నట్టు మాటలు ప్రారంభించాడు. రాజారావు చెప్పినా చెప్పకపోయినా అతని కుటుంబ సంగతులన్నీ అడిగాడు.

"మీ పెద్దక్క టీచరా? పెళ్ళిచెయ్యలేదా?" అన్నాడు.

"ఒకరు చేసేదేమిటి? తనే చేసుకుంది."

"ఓహూ! లవ్ మేరేజా? అలాంటి వ్యవహారం నీకేం లేదా ఇంకా?"

"... ... ..."

"ఏం కుర్రాళ్ళోయ్ మీరూ! మాకాలంలో అయితే."

రాజారావు మొహం ఇటూ అటూ తిప్పి గోడల మీద పిచ్చి పిచ్చిగా గీసి వున్న బొమ్మలు చూస్తున్నాడు. ఒక బొమ్మ పొడుగు ఆఫీసరు బొమ్మలాగే వుంది. బాగా చూస్తే అన్నీ వాడి పోలికలే. పొడుగు గడ్డం, సూది ముక్కు, బట్ట తల అంతా వాడి మొహమే నక్కలాగున్నాడు. ఈ గదిలో కొచ్చి వెళ్ళినవాళ్ళెవరో గీసి వుంటారు.

ఆఫీసర్ గది నాలుగు మూలలూ పరకాయించి చూశాడు.

"బాగుందా ఇక్కడ?"

"... ... ..."

"అవును. నీట్ గా లేదు. వెళ్దాం లే. ఇంకో చోటికి వెళ్దాం. విశాలంగా వుంటుంది అక్కడ. చూడు రాజారావ్! నేను అందర్లాంటి వాణ్ణి కాదు. పోలీసాఫీసర్లంటే అందరూ ఒకే రకం అనుకుంటారు మీరు. అది చాలా పొరపాటు. నా డ్యూటీ నేను చేస్తానుగానీ మీలాంటి వాళ్ళని చూసి ఎంత బాధపడతానో తెలుసా? ఎలాగా అరెస్టయిపోయారు వీలై నంత తక్కువ శిక్షతో బయట పడేట్టు చూసుకోండి. మీ మంచికోసమే చెపుతున్నాను. బాగా ఆలోచించు... తొందరేముంది? మీరు ఎదురు చూసే సమాజం ఎప్పటికొస్తుందోయ్. ఇవ్వాళో రేపో వస్తుందా? అసలు వస్తే ఎప్పుడో

మీరు పుట్టకముందు తెలంగాణా విప్లవం టైములోనే వచ్చేది. ఇప్పుడిక అదంతా పాత వ్యవహారం. మీరనుకునే సిద్ధాంతాలన్నిటికీ కాలం చెల్లిపోయింది. ఇప్పుడు ఏం జరిగినా శాంతియుతంగా జరగాలి. నే నెందుకు చెబుతున్నానంటే ఎంతైనా మీరు చిన్నవాళ్ళు. ఎవరో ఏదో నూరిపోస్తే అదంతా నిజమని నమ్మేస్తారు ఎంతో సుఖంగా స్వేచ్ఛగా తిరగవలసిన వయస్సులో జైళ్ళల్లో కూర్చుని ఏం సుఖపడతారు చెప్పు.

నాలుగైదు రోజుల కిందట మీలాగే ఇద్దరు కుర్రాళ్ళని అరెస్టు చేశాం. వేరే గ్రూపు వాళ్ళనుకో. మొదటకాస్త సిగ్గుపడ్డారు గానీ కొంచెం నచ్చజెప్పే సరికి "నిజంగా మనం తప్పుదారి తొక్కాం కదా" అని గ్రహించుకుని వాళ్ళకు తెలిసిన సంగతులేవో చెప్పి వెళ్ళిపోయారు. ఆ కుర్రాళ్ళకు మా డిపార్టుమెంటులో ఉద్యోగాలు కూడా ఇస్తున్నాం. మీలాంటి వాళ్ళు తల్చుకుంటే ఏముందోయ్. దేశానికి ఎంత సేవైనా చెయ్యొచ్చు... మీకు తెలిసిన సంగతులేవో ఒకటో రెండో చెప్పేస్తే మీదారిన మీరు పోవచ్చు. మా డ్యూటీ మేం చేసినవాళ్ళమవుతాం."—పది నిమిషాలసేపు ఆపకుండా చెప్పాడు పొడుగువాడు.

రాజారావు సగం మాటలు వినలేదు.

మొహం ఎటో తిప్పి గోడలు చూస్తూ కూర్చున్నాడు.

"వస్తా... మళ్ళీ కలుస్తా" అని వెళ్ళిపోయాడు ఆఫీసరు.

ఈ అరెస్టులమీద కొంచెం ఎక్కువ ఆశలే పెట్టుకున్నారు స్పెషల్ బ్రాంచి వాళ్ళు. వీలైనంత వరకూ నయాన్నే

పని సాధించాలని వాళ్ళ ప్రయత్నం! ఈ నక్క జిత్తులపోడుగు ఆఫీసరు గతంలో కొందరు కుర్రాళ్ళని మోసపుచ్చి బుట్టలో వేసుకోగలిగాడు. రాజారావు విషయం అంత తేలికకాదని వాడికి కొంత అర్ధమయింది.

ఆ పగలంతా ఏమీ జరగలేదు. అన్నం ఇవ్వలేదు సాయంత్రం బాగా చీకటి పడింతర్వాత రాజారావు వున్న గది తలుపులు తీశారు.

పదిమంది జవాన్లు రాజారావు చేతులు తాళ్ళతో కట్టారు. వరండాలోంచి నడిపించుకుపోయి కాంపౌండ్‌లో వేన్ ఎక్కించారు.

అప్పటికే రమణ వున్నాడు వేన్‌లో.

అతని చేతులు కూడా కట్టి వుంచారు.

ఇద్దర్నీ వేరు వేరుగా కూర్చో బెట్టారు.

వేన్ పోతూవుంది.

రమణా రాజారావు మార్గం చూస్తున్నారు. వూరికి చాలా దూరంగా అవుట్ పోస్టు స్టేషన్‌కి తెచ్చారు.

మళ్ళీ జవాన్లంతా చుట్టూజేరి ఇద్దర్నీ వేన్ దింపి లోపలికి తీసుకు పోయారు. వేరే వేరే లాకప్స్‌లో వేశారు.

రాత్రి పది గంటల టైమ్‌లో చిన్న చిన్న అన్నం పొట్లాలిచ్చారు.

"మా బట్టలెప్పుడిస్తారు?" అని అడిగాడు రమణ జవాన్లని.

"మాకు తెలవదు" అని వాళ్ళు బయటికి పోయి తాళం బిగించారు.

ఆ పిడికెడు అన్నం కడుపులో ఏ మూలకీ రాలేదు. చలి వణికిస్తోంది.

"చూద్దాం. వీళ్ళు ఎన్నాళ్ళకి ఇస్తారో చొక్కా—" అనుకున్నాడు రమణ కొంచెం నవ్వుకోడానికి ప్రయత్నిస్తూ.

ఎంత ధైర్యం చెప్పుకున్నా రమణకి చాలా ఆందోళనగా వుంది—అసలు ఎలా జరిగింది ఇది? మూడో కంటివాడికి తెలీదనుకున్న చోటు... ఎవరి ద్రోహంవల్ల జరిగింది? ... ... ఇప్పటికైనా 'పి'కి తెలిసిందో లేదో! తెలిస్తే ఏం ప్రయత్నాలు చెయ్యగలరు తమకోసం? బయటపడితేగానీ ఆ సంగతులేమీ తెలీవు... అరెస్టు చేసిన ఇరవై నాలుగ్గంటల్లో కోర్టు ముందు పెట్టాలి. వీళ్లు అదేం పాటించేట్టులేరు... ... పిచ్చిగా ఆలోచిస్తున్నాడేమిటి తను! రూల్సన్నీ ప్రజలకోసం గానీ, పోలీసులకోసం కాదని తెలీదా?"

రాజారావేం ఆలోచిస్తున్నాడో! రాజు దగ్గర వుంటే తనకు బాగుండేది. చాలా ధైర్యంగా వుండేది.

అసలు తమిద్దరూ చేసిన నేరం ఏమిటి? వీళ్ళకి దొరకడమేనా? వీళ్ళకి దొరకబట్టేకదా ప్రజలకోసం పనిచెయ్యడం దేశద్రోహం అయిపోయింది?

"అయితే ఏం చేస్తారు వీళ్ళు తమని?"

"... ... ..."

వీళ్లు తమని ఏదో చేసేదేమిటి? అవును. రాజు తప్పకుండా అలాగే అంటాడు- "వీళ్ళు మనల్ని ఏం చేసేదేమిటి ? మనం మనల్ని ఏం చేసుకుంటాం, అను" అంటాడు.

"మన అమ్మలూ, నాన్నలూ బోధిస్తోన్నట్టు కట్నాలు తీసుకొని పెళ్ళిళ్లు చేసుకుని తండ్రులో, మామలో సంపాయించి ఇచ్చే డబ్బులు ఖర్చుచేసుకుంటూ, పోలీసు వాళ్ళిచ్చే వుద్యోగాలు తీసుకుని ప్రజల్ని దగాచేస్తూ కులాసాగా తిరుగుతామా ?

లేకపోతే, మనకు తెలిసిన నిజాలకు కళ్ళు మూసుకోకుండా, ఎటు చూస్తే అటు, ప్రజలుపడే బాధలు అర్థం చేసుకుని మనకోసం, వాళ్ళ కోసం మనం చెయ్యవలసిందంతా చేస్తామా ?

ఏదో ఒకటి నిర్ణయించుకోవాల్సింది మనమే రాజూ ! మనల్ని మనం ఏం చేసుకుంటామో మనం నిర్ణయించుకోవాలి గానీ మనల్ని ఏం చెయ్యాలో ఇతర్లు నిర్ణయించేదేమిటి?" రమణ ఆలోచిస్తున్నాడు. కొత్త ఆలోచనలతో రమణ మనసంతా కొత్త వుత్సాహం నిండింది.

రాజారావు దూరంగా వున్నట్టు అనిపించనే లేదు. తను చదివిన అనేక దేశాల విప్లవకారుల జీవిత చరిత్రలెన్నో ఒక్కుమ్మడిగా గుర్తు వస్తున్నాయి. జైళ్ళూ, మరణాలు విప్లవకారుల జీవితంలో భాగాలే. త్యాగాలూ, సాహసాలూ లేని విప్లవం ఎక్కడుంటుంది.

రమణ మనసుకి కొత్త శక్తి వచ్చింది. "నా జీవితం ఏమైనాసరే, వుద్యమానికి ద్రోహం చెయ్యను." అనుకున్నాడతను.

ఎంతో సంతోషం కలిగింది, ఎన్నో కోట్లమంది ప్రజలు తనకు అండగా వున్నారనే ధైర్యం కలిగింది.

మురికికంపు గోనెపట్టామీద తల ఆన్చి చలికి ముడుచుకుని ఒక గంటసేపు నిద్రపోయి వుంటాడతను.

మొహంమీద టార్చిలైటు వేసి జవాన్లు కేకల్తో లేపారు అర్ధరాత్రి. రమణ వులిక్కిపడి లేచి అంతా గుర్తు తెచ్చుకుని పట్టుదలగా నిద్రమత్తు వొదిలించుకుని జవాన్ల వెంట నడిచాడు.

అక్కడ ఎప్పట్లాగే వుంది. టేబుల్ దగ్గిర అందరూ యూనిఫారాలు లేనివాళ్లు కూర్చుని వున్నారు. అందరూ పాతవాళ్ళే. పొడుగువాడు కూడా వున్నాడు,

రాజారావు నిలబడి వున్నాడక్కడ.

రమణ అతనికి కొంచెం దూరంలో నిలబడ్డాడు.

ఒక దేశ భక్తుడు చేతిలో లాఠీ ఆడిస్తూ వుపన్యాసం ఇస్తున్నాడు.

"—దేశ ద్రోహులెవరో మిమ్మల్ని వాళ్ళ స్వార్థం కోసం వుపయోగించుకోవాలని చూస్తున్నారు. మీలాంటి అమాయకు లెందరో వాళ్ళ వుచ్చుల్లో పడిపోతున్నారు. మన దేశం పవిత్ర భారతదేశం. భారతమాతకు సేవ చెయ్యడమే మా కర్తవ్యం. దేశ ద్రోహానికి తలపడే వాళ్ళని ప్రభుత్వం చూస్తూ వూరుకోదు. ఈ వుద్యమాలూ గిద్యమాలూ ఇవేవీ మిమ్మల్ని వుద్ధరించవు. మిమ్మల్ని వురికంబా లెక్కించడానికి తప్పితే మీ శ్రేయస్సు కేమీ పనిచెయ్యవు. మీరు పునర్జన్మల్ని కూడా నమ్మరే! వున్న ఒక్క జన్మ ఇలా ధ్వంసం చేసుకుని ఇంకేం సుఖపడతారు? దేశసేవకైతే ప్రాణాలివ్వాలి

గానీ ఇలాంటి దేశద్రోహానికి దిగటం..."—ఏదో పాఠం అప్పజెపుతున్నట్టు గబగబా మాట్లాడుతున్నాడు.

దేశభక్తియుత వుపన్యాసం ధారాళంగా సాగుతోంటే మిగిలిన దేశభక్తులు కుర్చీల్లో వెనక్కివాలి సిగరెట్లు కాలుస్తూ అపారమైన దేశభక్తి ప్రకటిస్తున్నారు.

వుపన్యాసకుడు కూడా సిగరెట్ వేపు మొగ్గి దేశభక్తి ఆపి సిగరెట్టు ముట్టించాడు.

వాళ్ళు ఆ రోజంతా చేసిన పని— రాత్రి దాడిలో దొరికిన కాయితాలన్నీ పరిశీలించడం. తమకు పట్టుబడ్డవారిద్దరూ "విప్లవ" కార్యక్రమాల్లో వున్నారనడానికి వాళ్ళకేమీ సందేహం లేదు. అయితే వాళ్ళ అనుమానాన్ని రుజువు చేసే సాక్ష్యాలేమీ లేవు. కొన్ని కాయితాల్లో రహస్య సంకేతాల్ని తెలిసినవాళ్ళు చెప్తే తప్ప- తెలుసుకోవడం సాధ్యం కాదు.

రామారావనే వ్యక్తి ఈ గ్రూపు కార్యక్రమాల్లో చాలా చురుగ్గా వున్నాడని వాళ్ళందరికీ బాగా నమ్మకం కలిగింది. రాజారావు వల్ల ఆ వొక్క వ్యక్తి సమాచారం సేకరించినా చాలు అనుకుంటున్నారు వాళ్లు.

"రామారావు ఎక్కడుంటాడు?" అని మళ్ళీ మొదలు పెట్టారు.

"... ... ..."

"మీరు త్వరగా జవాబు చెప్పండి"

"నాకు తెలీదు. పొద్దుట్నించీ చెపుతున్నాను"అన్నాడు రాజారావు కోపం ఆపుకొంటూ.

"చెబుతున్నావులే పొద్దుట్నించీ అబద్ధాలు. అతన్ని గురించి నీకు తప్పకుండా తెలుస్తుంది."

"మీరు అలాగంటే ఇక నేను చెప్పగలిగిందేమీ లేదు."

"పోనీ, అతని వివరాలు చెప్పు. తెల్లగా వుంటాడా? నల్లగా వుంటాడా?

"చామనచాయగా వుంటాడు."

"ఎత్తెంత ?"

"ఐదడుగుల పైన వుండొచ్చు"

పైన అంటే ? రెండంగుళాలా మూడంగుళాలా ?"

వాళ్ళు రామారావు గురించి ఎన్ని ప్రశ్నలు అడిగారంటే—నిజంగా ఒక వ్యక్తి గురించి అన్ని వివరాలూ సరిగ్గా సేకరించగలిగితే ఆ వ్యక్తి ఎక్కడవున్నా పట్టెయ్యవచ్చు.

"రామారావనేది అతని స్వంతపేరా ? మారుపేరా ? లావుగా వుంటాడా? సన్నగా వుంటాడా? ఏం భాషలు మాట్లాడతాడు? ఏ భాష స్వచ్ఛంగా మాట్లాడతాడు? ఏ భాషలు వచ్చీరానట్టు మాట్లాడతాడు? అతను ఏం కులం? ఏం మతం? ఏం ప్రాంతం? ఏం చదివాడు? ఎక్కడ చదివాడు? మొహం కోలగా వుంటుందా ? గుండ్రంగా వుంటుందా? గడ్డం మీసాలు వుంచుతాడా? తీసేస్తాడా? తల బట్టతలగా వుంటుందా? జుట్టుబాగా వుంటుందా? వయస్సెంత? ఆరోగ్యంగా వుంటాడా? ఏ రకం బట్టలు వేస్తాడు? ఖరీదైనవా? సింపుల్‌గా వుండేవా? సిగరెట్లు కాలుస్తాడా?-ఈరకం ప్రశ్నలు అంతులేనన్ని అడిగారు.

రాజారావు అన్నిటికీ నోటికొచ్చినట్లు చెప్పాడు. రామారావనే వ్యక్తిలేనప్పుడు అతని పోలికల గురించి అంత ఆలోచించి చెప్పవలసిందేముంది?

"పేపరు కటింగ్స్ పంపించు - అని ఒక చీటివుంది. మీా కాయితాల్లో. అది ఎవరు పంపారు నీకు?"

"రామారావే, విద్యార్థుల సమ్మెలకు సంబంధించిన వార్తలు సేకరించి వుంచమని చెప్పాడు ఒకసారి. కొన్ని వార్తలు తీసివుంచాను."

"నీకు పేపర్లెక్కడివి? అన్నీ కొనేవాడివా,"

"లైబ్రరీలో కూర్చుని కావాలనుకునే వార్తలు నోట్ బుక్‌లో రాసేవాణ్ణి"

"ఈ చీటీ నీ దగ్గరికెవరు తెచ్చారు?"

"ఒకమ్మాయి. నేను సేకరించిన వార్తలు కూడా ఆమె కిచ్చి పంపించాను."

"ఎంత వయస్సుంటుందా అమ్మాయికి?"

"పదమూడు, పధ్నాలుగేళ్ళు."

"ఏం పేరు?"

"పూర్తిపేరు తెలీదు. 'డి' అని చెప్పింది.

"ఎన్నిసార్లు వచ్చింది నీ రూమ్‌కి?"

"ఒక్కసారే."

"మీాకు అండర్ గ్రౌండ్ పేపర్ ఏదన్నా వుందా?"

"అంటే?"

"రామారావు మీాకోసం రహస్యంగా చదవమని పేపర్లేం ఇచ్చేవాడు కాదా?"

"అలాంటివేం నా కివ్వలేదెప్పుడూ."

"మీ గ్రూపుకి "... ..." అని ఒక పేపరుంది. అది ఎన్ని సంచికలు చూశావు?"

"అలాంటిది నేనెప్పుడూ చూడలేదు."

"మీదగ్గిర కాయితాల్లో రెండు మూడు చోట్ల 'యాదగిరి'. 'కృష్ణయ్య' అనే పేర్లున్నాయి. ఎవరు వాళ్లు? ఎక్కడుంటారు?"

"వాళ్ళగురించి నాకేమీ తెలియదు."

ఒక గంటకు పైగా ఈ ప్రశ్నలే మళ్ళీ మళ్ళీ రకరకాలుగా సాగాయి.

రాజారావు ఎక్కడా తొట్రుపడకుండా జవాబులు చెప్పాడు.

ఆఫీసర్ల ఆశ కొంత తగ్గుతోంది. అయినా "శాంత" మూర్తులై సహనం ప్రదర్శిస్తున్నారు.

ఒక ఫోటో ఆల్బమ్ చూపిస్తూ— "వీళ్ళల్లో మీ రెవర్ని పోల్చగలరో చూడండి" అన్నారు.

రమణ తనకేం సంబంధం లేనట్టు మాట్లాడకుండా నించున్నాడు.

రాజారావు చాలా ఫోటోలు చూశాడు. ఇద్దరు ముగ్గుర్ని పోల్చగలిగాడు. మొహంలో ఏమీ వ్యక్తం కానివ్వకుండా మిగిలిన ఫోటోలవేపు దృష్టి మళ్ళించుకున్నాడు.

"ఈయన తెలుసు" అని ఒక ఫోటో దగ్గిర ఆగాడు.

"ఎవరు?" అంటూ ఆఫీసర్లంతా ఆతృతగా ఆఫోటో మీదకి వొంగారు. ఆ ఫోటోలో వ్యక్తి రెండేళ్ళ కిందటే

అమెరికా వెళ్ళిపోయాడని రాజారావుకి తెలుసు. ఆఫోటో చూసి ఆఫీసర్లంతా తమకేదో అవమానం జరిగినట్లు గుర్రుగా చూసి అసహనంగా కదిలారు. ఒకళ్ళిద్దరు కుర్చీల్లోంచి లేచారు.

ఒక పొట్టివాడు గబ గబా నాలుగు బూతుతిట్లు విసిరాడు.

ఇంకో ఆఫీసరు ఏమీ జరగనట్టు రమణని చూస్తూ "నీకు వుద్యోగం లేక ఈ వ్యవహారంలోకి దిగినట్టున్నావు, మా దగ్గర వుద్యోగం ఇస్తాం. చేస్తావా? రేపే నీకు ఆర్డర్స్ ఇస్తాం." అన్నాడు.

"చెయ్యను." రమణ.

"ఏం? ఎందుకని?"

"ఇలాంటి ఉద్యోగంలో నాకు అభిరుచి లేదు."

"మరి ఎలాంటి ఉద్యోగంలో నీకు అభిరుచి? దేశ ద్రోహంలోనేనా? అంతేనా?"

"నేను దేశద్రోహం చేశానని మీరు రుజువుచేయగలరా?"

"ఏమిట్రా రుజువు చేసేది?" పచార్లు చేస్తోన్న ఆఫీసరొకడు చేతిలో లాఠితో రమణ తలమీాద గబగబా ఏడెనిమిది దెబ్బలు వేశాడు.

"అదీ చెయ్యాల్సింది. అంతేగానీ చుట్టాల్ని మర్యాద చేసినట్టు చక్కగా కూర్చొబెట్టి సంభాషణలుజరిపితే ఈ లం... కొడుకులికి తెలుస్తుందా?"

"వారే! కుక్కల్లా మీరు! స్పెషల్ బ్రాంచి

పోలీసాఫీసర్లంటే!మీకేం తెలిసినట్టులేదు. తెల్లారేసరికి మిమ్మల్ని అడవులికి పంపించేస్తాం తెలుసా?" అని అరిచాడు పొట్టివాడు.

"అంటే?" అప్రయత్నంగా అడిగాడు రాజారావు.

"అంటేనా? చెప్పండిసార్ ! అంటే ఏంటో అడుగుతున్నాడు" అని పొట్టివాడు పొడుగువాడితో వెటకారంగా నవ్వుతూ అన్నాడు.

అప్పటి వరకూ మౌనంగా కూర్చున్న పొడుగు ఆఫీసరు శాంతంగా చెప్పాడు.

"అక్కడ మిమ్మల్ని షూట్ చేస్తారు."

"అంతేనా?" అన్నట్టు చూశాడు రాజారావు.

రమణ అసలు ఆ సంభాషణ తన కోసం కానట్టు నిలబడ్డాడు.

"తెలిసిందా ఇప్పుడు ? బాగుంటుందా అలాచేస్తే?"

"... ... ..."

"చెప్పండి. బాగుంటుందా?"

"మీ ఇష్టం. మీ కిష్టమైనట్టు చేస్తారుగానీ మా బాగోగుల్ని బట్టి చేస్తారా?"

మీరు చెప్పినట్టే చేస్తాం. చెప్పండి-ఏం చెయ్యాలి మిమ్మల్ని ?"

"మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండి."

"మీరు చెప్పినట్టు చేస్తామంటున్నాంగా.

"అయితే మమ్మల్ని వొదిలెయ్యండి. మేమేం నేరం చేశాం మిమ్మల్నిలా పీడించడానికి?"

"మీ దగ్గిర దొరికిన సమాచారం అంతా కోర్టులో పెట్టి మీమీద ప్రహాండమైన కుట్రకేసు పెట్టొచ్చు తెలిసిందా? చట్టబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదొయ్యాలని ప్లాను చేస్తున్నారు మీరు. ప్రజల్ని రెచ్చగొడుతున్నారు. మీ కాయితాలన్నీ బయిటపెట్టి మీ మీద కేసు నడిపితే మీరు జన్మంతా జైళ్ళలో పడి మగ్గవలసిందే. మీ నేరం మీకు తెలీటం లేదా పాపం?"

"మా దగ్గిరవున్న కాయితాలన్నీ మా రాజకీయ సిద్ధాంతానికి సంబంధించినవే. దేశంలో ప్రతి పౌరుడికి రాజకీయమైన స్వాతంత్రం వుందని చెపుతోంది ప్రభుత్వం. మా కిష్టమైన రాజకీయ సిద్ధాంతాన్ని మేము అచరించవచ్చు. దానికోసం పని చేసుకోవచ్చు. మా రూమ్‌లో కమ్యూనిస్టు సాహిత్యం వుండడం, మేము కమ్యూనిస్టు భావాలతో వుండడం, ప్రజల కోసం మేము చెయ్యగలిగే పనులేవో చెయ్యడం- ఇవేవీ దేశ ద్రోహాలు కావు.

దేశంలో ప్రజలే మెజారిటీగా వున్నారు. ప్రజలకు ఏ రాజకీయాలు ఇష్టమైతే ఆ రాజకీయాల్నే అనుసరిస్తారు. ప్రజలకు నచ్చని భావాల్ని ఎవరూ వారిమీద రుద్దలేరు. విప్లవకారులు కూడా ఆ పని చెయ్యలేరు.

"ప్రభుత్వాన్ని కూల దొయ్యడానికి కుట్రలు పన్నుతున్నామని నేరాలారోపిస్తున్నారు. మా మీద. ప్రభుత్వాన్ని కూల దొయ్యదల్చుకుంటే ఆ పని ప్రజలే చేస్తారు. ప్రజలకు ఏది అక్కర్లేకపోతే దాన్ని తోసేసి, ఏది కావాలంటే దాన్ని తెచ్చుకుంటారు.

మా రాజకీయ సిద్ధాంతం ప్రజల బలంమీద అధార పడ్డదేగానీ, ప్రజా వ్యతిరేకంగా కత్తులమీదా, తుపాకుల మీద కుట్రలమీద అధార పడ్డదిగాదు.

మెజారిటీ ప్రజలకు నచ్చి వాళ్లు తెచ్చుకునే మార్పు ఏదీ కుట్రకాదు. ప్రజల బలంమీద ఆధారపడే రాజకీయ సిద్ధాంతం ఎప్పుడూ కుట్రకాదు."

"రాజారావు ఆ మాత్రం జవాబు చెప్పకుండా ఆగలేక పోయాడు. ఎక్కువ మాట్లాడవద్దనుకుని కూడా ఆపుకోలే కుండా మాట్లాడాడు. తర్వాత ఏం జరిగినాసరే, విప్లవ కారుల నిజాయితీ ఏమిటో ఈ ద్రోహులకు చెప్పకుండా వుండలేక పోయాడు.

"పోలీసాఫీసర్లంతా తెల్ల బోయారు. నోరు తెరిస్తే బూతులు గుప్పించడం, ప్రభుత్వం లైసెన్సు ఇచ్చిన గూండా గిరీ చెలాయించడం తప్పితే - సంస్కార వంతమైన మాట, చేతా ఎరగని ఆ ఆఫీసర్లు రాజారావు ధైర్యానికి, న్యాయానికీ కాసేపు మొహాలు వేళ్లాడేశారు. వెంటనే ఎవరికివాళ్ళు తేరుకుని మరింత కరుగ్గా మొహాలు బిగించారు.

"అయితే మీరిద్దరూ విప్లవం తేదల్చుకున్నారా దేశానికి?" అని వుగ్రంగా అరిచాడొకడు.

"మేమలా అనుకోవడంలేదు. మేమిద్దరమే విప్లవం తెస్తామేమోనని మీరే భయపడుతున్నారు."

"ఏంట్రా వాగుతున్నావ్?" అని రాజారావుని గూడ దాద చరిచాడు గూండా ఆఫీసరు,

"మా మీద కుట్రకేసు పెట్టదగ్గంత సమాచారం మీ దగ్గర వుండగా మాతో ఈ ఇబ్బందంతా ఎందుకు మీకు? మీ ప్రభుత్వం స్థాపించిన కోర్టులున్నాయి. చట్టాలున్నాయి. మమ్మల్ని కోర్టులో పెట్టండి. మా నేరాలు విచారించండి. దేశద్రోహులం అని శిక్షలు వేయించండి. మమ్మల్ని బాధించడానికి మీకేంహక్కు వుంది!" అని అరిచాడు రమణ.

"ఆఫీసర్లకి గంగవెర్రు లెత్తుతున్నాయి. "ఇక లాభం లేదు సార్ వీళ్ళతో. తోళ్లు వూడదీస్తేగానీ వీళ్ళ పొగరణగదు. తెల్లారేపాటికి వీళ్ళనెలా దారికి తెస్తామో చూడండి" అన్నాడు పొట్టివాడు వూగిపోతూ, వాడు ఆరు నెలలనించీ ప్రమోషన్ గురించి తప్పితే రెండో సంగతి ఆలోచించడం లేదు.

పొడుగువాడు తల పంకించి - "కానివ్వండి" అని శాంతంగా ఆర్డరు జారీచేశాడు.

* * * *

మానవశరీరానికి సంబంధించిన శాస్త్రపరిజ్ఞానం ఏ డాక్టర్లకీ తెలీనంత క్షుణ్ణంగా స్పెషల్ బ్రాంచి పోలీసువాళ్ళకి తెలుసు. శరీరంలో ఎక్కడెక్కడ ఏ ఏ రకమైన సున్నితమైన భాగాలు వుంటాయో- ఏఏ నరాలు ఏఏ విధాలుగా ఎంతెంత స్పందన కలిగిస్తాయో- ఏఏ అవయవాల్ని ఎటు తిప్పితే, ఎటు వంచితే, ఎటు మెలికవేస్తే, రక్తప్రసారాన్ని ఎక్కడ ఆపితే, ఎక్కడ నిలిపితే, ఎక్కడ ఆటంకపరిస్తే, ఏంచేస్తే, ఏం చెయ్యకపోతే మానవ దేహానికి భయంకరమైన, అనంతమైన బాధ కలుగుతుందో- ఏ ఏ రకాల బాధల్ని భరించడం ఆ దేహానికి అసాధ్యమైపోతుందో - అంతా... ...సమస్తం తెలుసు వాళ్ళకి. బాధని

సృష్టించడంలో మహా చతురులు వాళ్లు. బాధని సృష్టించే మార్గాలు కనిపెట్టడంలో మహా నేర్పరులు వాళ్ళు. హింసించడంలో నిత్య నూతనమైన పద్ధతులకోసమే వాళ్ళ మెదళ్లు ఎప్పుడూ ఆలోచిస్తూ వుంటాయి. వాళ్లు "ఇది చేస్తారు. అది చెయ్యరు." అనేది లేదు.

"ఈ పనికి జంకుతారు. ఆ పనికి సంకోచిస్తారు." అనేది లేదు. బాధని పుట్టించడంలో వాళ్ళు చెయ్యలేని, చెయ్యరాని పనులేమీ లేవు. మానవ శరీరం ఎంత క్షోభ పడితే అంత శాంతి వాళ్ళకి. ఎంత రక్తం కారిస్తే అంత ఉత్సాహం వాళ్ళకి. బాధని సృష్టించడంలో కొత్తకొత్త పద్ధతులు దొరికిన కొద్దీ ఆనందం వాళ్ళకి. పాత పద్ధతులు, పాత అనుభవాలు, పాత హింసా విధానాలు వాళ్ళకి ఎప్పటికప్పుడు అసంతృప్తి కలిగిస్తాయి. హింసించడంలో యుగయుగాలుగా నిలువ జేసుకున్న జ్ఞానాన్నంతటినీ అత్యంతమైన శ్రద్ధతో, నేర్పుతో నేర్చుకుంటారు వాళ్ళు. చిత్ర చిత్రమైన హింసలు పెట్టి మానవ దేహాల్ని పీడించడంలో "స్పెషల్ ట్రైనింగ్"లు పొందుతారు వాళ్ళు. వాళ్ళ స్వంత జ్ఞానాలూ, మేధలూ, ఆలోచనా శక్తులూ, శక్తి యుక్తులూ, వుపయోగించి మరింత మరింత బాధని వృద్ధిచేసే విధానాలు కనిపెట్టి, బహుమతులూ, ప్రమోషన్లూ పొందుతారు వాళ్ళు.

వాళ్లు మనుషుల్లాగానే వుంటారు. పేంటులూ, షర్టులూ, బూట్లూ, వాచీలూ, కళ్ళజోళ్ళూ, చిరునవ్వులూ ధరించి నవ నాగరికత వుట్టిపడుతూ వుంటారు. నోరు తెరిస్తే అహింస గురించీ, సత్యం గురించీ, దయాదాక్షిణ్యాల గురించీ, దాన

ధర్మాల గురించీ, మానవత్వం గురించీ ముచ్చటిస్తూ వుంటారు. బంధు మిత్రుల్లో గొప్ప పోలీసు ఆఫీసర్లుగా, మాతృదేశ రక్షకులుగా, కీర్తిగాంచుతూ వుంటారు. దేశంలో ప్రతిక్షణం భద్రతల్ని నిలబెట్టేది తామేనని గర్వంతో విర్ర వీగుతూ వుంటారు.

నిజం చెప్పాలంటే ప్రస్తుత దేశానికి రక్షకులు వాళ్ళే. వాళ్ళేం చేసినా దేశ రక్షణ కోసమే చేస్తారు. ప్రజలంతా పోలీసువాళ్ళ అడుగులకు మడుగులొత్తాలని వాళ్ళు కోరు తారూ అంటే అది దేశరక్షణకోసమే. వాళ్లు హఠాత్తుగా అర్ధరాత్రుళ్లు ఇళ్ళమీద పడి ప్రజల్ని వేనుల్లో ఎక్కించి లాక్కుపోతారంటే అదీ దేశరక్షణ కోసమే. ప్రజలంతా ఎప్పుడు ఎక్కడ ఏం చేస్తారో, ఏం మాట్లాడుతారో వాళ్లు కనిపెడుతూ తిరుగుతారంటే అదీ దేశరక్షణ కోసమే. పోలీసు స్టేషన్లలో చిత్రహింసల కోసం ప్రత్యేకమైన గదులు కావాలనీ, వాటిలో రకరకాల బాధలు పుట్టించే అధునాతన మైన పరికరాలు కావాలనీ, ఆ గదుల్లో పుట్టే అరుపులూ కేకలూ, ఏడుపులూ, బయటికి రాకుండా, శబ్దం బయటికి పోక్కని పద్ధతిలో ఆ గదుల్ని "సౌండ్ ప్రూఫ్" చెయ్యాలని పోలీసులు ప్రభుత్వాన్ని కోరుతారూ అంటే అదంతాకూడా దేశరక్షణకోసమే! శాంతి భద్రతల్ని అహింసాయుతంగా కాపా డడం కోసమే!

ఈ దేశ సేవకులు, రాజారావు విషయంలో గానీ, రమణ విషయంలో గానీ తమ ఆదర్శానికి విరుద్ధంగా ఎందుకు ప్రవర్తిస్తారు?

ఆర్నెల్లనించీ ప్రమోషన్ కోసం ఎదురుతెన్నులు చూస్తోన్న పొట్టి ఆఫీసరు "దేశద్రోహులైన" రమణతో, రాజారావుతో "నిజం కక్కించే కార్యక్రమం తీసుకున్నాడు. వాళ్ళ లేత శరీరాలమీద తన చతుర విద్యలన్నీ ప్రారంభించాడు. తన ఆధ్వర్యంలో జరిగే హింసకి వాళ్లు చలించకపోతే ఆత్మ ధైర్యంతో వాళ్లు ఓర్చుడానికి ప్రయత్నిస్తే వాడు చాలా అవమాన పడ్డాడు. విప్లవకారుల బాధనీ, దుఖాన్నీ ప్రత్యక్షంగా చూస్తేనేగానీ వుత్తర క్తంతో వాడు తృప్తిపడడు.

"బండ లం... కొడకా! కిక్కురు మనకుండా నించుంటావేంరా? మొన్న నీలాగే ఒకడు పంతంపట్టి నోరు తెరవకుండా నించుంటే, వాడూ వాడి అబ్బా కూడా చావు కేక లేసేట్లు చేశాన్లే, అదంతా నీకూ రుచి చూపిస్తా" అని వుత్సాహంతో తన కార్యక్రమం కొన సాగించాడు.

వాడి చేతుల్లో బాధపడే ఆ దౌర్భాగ్యులు భయంకరంగామూలగడం, అరవడం, ఏడవడం తిట్టడం చేసిన కొద్దీ ఆఫీసర్లు ఇనుమడించిన వుత్సాహం ప్రదర్శించారు. వాళ్ళిక తొందరగానే దార్లోకి వస్తారని వాళ్ళ శరీరాల్ని బాధలో ముంచేసి మళ్ళీ మళ్ళీ ప్రశ్నలు గుప్పించారు. ఎక్కడెక్కడో వాళ్లు ఎన్నడూ వినని పేర్లు అడిగారు. వాళ్ళుదాచిన అయుధాలు మందుగుండు స్తావరాలూ ఎక్కడున్నాయో తక్షణం చెప్పెయ్యమన్నారు.

"ఆయుధాలు లేకపోతే విప్లవం ఎలా చేస్తార్రా? మీకు నోరు తెరిస్తే ఆయుధాలు కావాలి గదరా?" అని బూతులు కూశారు.

కథా నిలయం
239



"మా ఆయుధాలు ప్రజలే. భారతదేశం నిండాకోటాను కోట్ల సంఖ్యలో వున్నారు. మా ఆయుధాలు." అని దృఢంగా చెప్పాడు రమణ

వాళ్లు దేనికైనా ధిక్కారంగా జవాబుచెప్తే వాళ్ళని పెట్టే హింస హింసగా లేదని, అది వాళ్ళకు చాలా నాజూకు వ్యవహారంగా వుందనీ వెంటనే దాన్ని మారుస్తారు. వృద్ధి చేస్తారు.

"మా డిపార్టుమెంటుకి వున్న శక్తి సామర్థ్యాలు చూడండి. ప్రభుత్వం మా కప్పగించిన అధికారాలు చూడండి మా బలంముందు మీరెంత? మీ వుద్యమాలెంత" అని విర్రవీగుతారు వాళ్ళు.

"మీ బలం పశుబలం. మానవుడిముందు పశుబలం ఎన్నటికీ నెగ్గలేదు." అని నిర్భయంగా ప్రకటించాడు రమణ.

వాళ్ళు ధైర్యం ప్రదర్శించిన కొద్దీ వాళ్లు చేసిన "దేశద్రోహం" అనేకరెట్లు పెరిగింది. వూహాతీతమైన బాధలోకూడా వాళ్ళు ప్రదర్శించిన నిబ్బరం, సాహసం పోలీసువాళ్ళకి గంగ వెర్రులెత్తించింది. మరింత కఠినమైన పద్ధతులతో బుద్ధి చెప్పడానికి అవకాశాలున్న పోలీసు స్టేషన్లకి వాళ్ళని మార్చారు.

ఈలోగా—

పోలీసులు - రాజారావునీ, రమణనీ అరెస్టు చేసిన ఇంటికి చుట్టు పట్ల ఇళ్ళవాళ్ళని కొందర్ని పోలీసు స్టేషన్‌కి పిలిపించి బెదిరించి అడిగారు—దేశద్రోహుల సంగతులన్నీ చెప్పమని. ఆ ఇరుగు పొరుగు ఇళ్ళవాళ్లు కొత్త సమాచారం ఏమీ ఇవ్వలేకపోయారు. రమణ కూడా రాజారావుతో

ఎప్పుడూ ఆ ఇంట్లోనే వుంటున్నాడని మాత్రం వాళ్ళు చెప్ప గలిగారు. రమణ పిన్నిగారింట్లో వుండే మాట అబద్ధమని బయట పడింది. దానితో రమణనేరం నిర్ధారణఅయిపోయింది. పోలీసువాళ్ళ దృష్టిలో.

రాజారావు గతంలో ఎప్పుడో అనవసరపు కాగితాలు చించకుండా వొదిలేసిన దానికి ఫలితంగా అతని కాయితాల్లో ఇద్దరు స్టూడెంట్సు పేర్లు బయట పడ్డాయి. మర్నాటికి వాళ్ళని అరెస్టుచేసి, వాళ్ళ కాలేజీ నోట్సులతో సహా తీసుకు వచ్చారు. వాళ్ళ రైటింగ్సుతో అరెస్టుల్లో దొరికిన కాయితాల్ని పోల్చి చూశారు. ఏదీ కుదరలేదు. తర్వాత ఆ స్టూడెంట్స్‌ని ఆ స్టేషన్ నుంచి తీసుకుపోయారు.

అరెస్టులు జరిగిన రెండోరోజు —

రాజారావు తండ్రికీ, రమణ తండ్రికీ పోస్టులో రెండు వుత్తరాలు వచ్చాయి—వాళ్ళ పిల్లల్ని ఫలానా సమయంలో పోలీసులు అరెస్టు చేశారనీ, వెంటనే ఆ విషయం గురించి తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకొమ్మనీ, తాము చెయ్యగలిగే ప్రయత్నాలన్నీ కూడా చేస్తున్నామనీ పార్టీ వ్యక్తి సంతకం లేకుండా రాసిన వుత్తరాలవి.

అరెస్టయిన వాళ్ళ తండ్రులు వెంటనే పోలీసు సూప రింటెండెంటుకీ, కలెక్టర్‌కీ తాశిల్దారుకీ టెలిగ్రాములు పంపి తమ పిల్లల్ని తక్షణం కోర్టులో హాజరు పరచాలని అడిగారు.

"మీకీ సమాచారం ఎలా తెలిసింది?" అని పోలీసు వాళ్ళు అడిగితే పోస్టులో వచ్చిన వుత్తరాలు చూపించారు.

ఆ వుత్తరాలవల్ల అవి ఎక్కడ పోస్టయ్యాయో. తప్పితే ఇంకో సంగతేదీ తెలియనందుకు పోలీసువాళ్లు చాలా నిరుత్సాహ పడ్డారు.

"మీా పిల్లల సంగతి మాకేం తెలీదు. అసలు ఆ రోజు ఆ ప్రాంతంలో అరస్టులే చెయ్యలేదు మేము. మీా పిల్లల్ని పార్టీవాళ్ళే ఏ అడవి ప్రాంతానికో పంపేసి ఆ నెపం మా మీాద తోయ్యాలని చూస్తున్నారు. ఈ గొడవతో మాకేం సంబంధం లేదు అని సమాధానం చెప్పారు వాళ్ళు. బయట జరిగిన ఈ సంగతులేమీా తెలీవు రాజారావు వాళ్ళకి.

వాళ్ళని మార్చిన ఒక కొత్త పోలీసు స్టేషన్‌లో దాదాపు వాళ్ళు స్పృహ తప్పి వున్న పరిస్థితుల్లో - స్టేషన్ వరండాల్లో పెద్ద గల్లంతూ ఏడుపులూ విన్నారు.

పోలీసులు - ఒక లంబాడీ జట్టుని, ఆడవాళ్ళనీ మొగ వాళ్ళనీ అరెస్టు చేసి తెచ్చారు. వాళ్ళని లాఠీలతో చాలాసేపు కొట్టారు.

రాజారావు తన బాధలో కూడా కళ్లు విప్పి - "వాళ్ళ నెందుకు కొడుతున్నారు?" అని కొంత సానుభూతి చూపే జవాన్‌ని అడిగాడు.

అతను వుదాసీనంగా - "కొడతారు" అని వూరుకున్నాడు.

ఇంకో జవాను లంబాడీల్ని నాలుగు బూతులు తిట్టి - "...కొట్టరా మరి ?" అన్నాడు.

ఇన్‌స్పెక్టర్లు లంబాడీల గుడ్డలన్నీ చింపేశారు. ఆడ వాళ్ళ గాజులూ, పూసలూ అన్నీ పగల గొట్టారు. వాళ్ళని

నానా భీభత్సం చేసి - "మీలో ఒకణ్ణి విడిచి పెడతాం. వాడు బైటికి పోయి రెండు వందలు తెస్తేనే అందర్నీ విడిచి పెడతాం. లేకపోతే అందరిమీదా కేసులు పెట్టి జైళ్ళల్లోకి గెంటుతాం. పదేసేళ్లు జైళ్ళల్లో మగ్గవలసిందే మీరు. ఎవడు పోతాడో పోయి సాయంత్రానికి డబ్బు తీసుకురండి" అని ఒకణ్ణి బైటికి తీశారు. లంబాడీలు ·ఘోల్లుమని ఏడుపులు లంకించుకోగానే వాళ్ళని మళ్ళీ చితకగొట్టారు.

పోలీసులు జరుపుతోన్న బేరసారాల్లో ఏమీ రహస్యం లేదు. లంబాడీల కేకల్లో ఏడుపుల్లో కూడా రహస్యంలేదు. ఆ రోజంతా లంబాడీలతో స్టేషన్ అంతా వూడ్పించి, కడిగించి, లాఠిలతో కొడుతూ స్టేషన్‌లో మరుగు దొడ్లతో సహా అంతా సాపు చేయించారు.

అలాంటి ఘోరాలు రాజారావుకి కొత్త సంగతులు కావు. అతనికి తెలిసిన అనేక విషయాల్లో ఈ విషయం ఏమంత ఘోరమైందీకాదు. అయనా ఆ క్షణంలో ఆ ఏడుపులు అతని బాధకి మరింత చేరువయ్యాయి.

"అన్యాయాల్ని వ్యతిరేకించడానికి ఎంతబాధ భరిస్తేనేం? విప్లవత్వంలేని జీవితం ఎంత వ్యర్థం!" అనిపించింది ఇంకోసారి రాజారావుకి చాలా దృఢంగా.

నాలుగేళ్ళ కిందట ప్రసాద్ పరిచయంతో వాస్తవానికి కళ్లు తెరిచి, ఈ కార్యక్రమాలకు ఆకర్షితుడైనా తర్వాత ఒక్క క్షణమైనా విశ్రాంతి లేదు రాజారావుకి.

అతని మనసు ఒక్క నిమషాన కూడా వెనక్కి జంక లేదు. భయం అనేది దినదినానికీ తగ్గింది, దాని స్థానంలో

సాహసం, పీడిత ప్రజల విముక్తికై ఆరాటం దినదినానికి హెచ్చింది, భయపడటం ప్రారంభిస్తే దానికి అంతమనేది లేదనే సంగతి అతనికి తొందరగానే బోధపడింది.

నిత్యజీవితంలో సమాజ స్థితిగతులూ, నిత్యం ప్రపంచ మంతా జరిగే దుర్భర సంఘటనలూ, అతను చదివిన అనేక వుద్యమ చరిత్రలూ, విప్లవకారుల జీవిత చరిత్రలూ, వారి నిస్వార్థ త్యాగాలూ సాహసాలూ - ప్రతీక్షణం అతని దీక్షని పెంచి కార్యోన్ముఖుని చేశాయి. రాత్రింబవళ్ళూ కష్టించే ప్రజలకు తిండిలేని దౌర్భాగ్యమో, వాళ్ళ వంతుకు వచ్చే ముష్టితనమో... మరేదో, ఇంకేదో అతనికి విచారం కలిగించే ఒక్క వాస్తవం చాలు - అతని పట్టుదలని సడలనివ్వకుండా చెయ్యడానికి.

"మన ధిక్కారమే ఈ దుఖాన్నంతటినీ మార్చగలుగు తుంది. అన్నాడు ప్రసాద్ ఒకసారి.

ఏ మహాదర్శనం, ఏ వున్నతాశయం వారిని ఆకర్షించి ముగ్ధుల్ని చేసిందో అది ఇంత బాధలో కూడా చెక్కుచెదర లేదు. చిత్రహింసలూ, మరణ శిక్షలూ స్వాతంత్రి ప్రియుల, ప్రజాహితుల దీక్ష నెన్నటికీ సడలించలేవు. బానిస యుగాలనించీ విప్లవకారు లెందరో వురికంభాల్ని కౌగలించు కున్న సాహసాలు ప్రదర్శించా రెందుకు? దేనికోసం ?— అది ధర్మం! అది సహజం! ఆ సహజత్వమే నశిస్తే మానవ సమాజం ఎన్నివేల సంవత్సరాలైనా నరహంతకుల పాదా క్రాంతమై వుండి పోయేదే.

రమణనీ, రాజారావునీ పోలీసులు కొన్నిదినాలు దుర్భరమైన బాధలో, హింసలో వుంచేశారు.

చివరికి ఒకరోజు వాళ్లని మళ్ళి వేన్‌లో పడేసి ప్రయాణానికి సిద్ధం చేశారు. వాళ్ళ శరీరాల్లో బాధని తప్పించుకున్న భాగాలెక్కడా మిగల్లేదు. భుజాలు, మోచేతులు, అరిచేతులు, మోకాళ్ళు, పాదాలు, తొడలు, పిక్కలు, దవడలు, దంతాలు చెంపలు, కంఠం కింది భాగాలు,చెవి వెనుకభాగాలు, పిర్రలు, మర్మావయవాలు—అన్నీ బాధతో చిట్లుకుపోయి రక్తాలు కార్చాయి. వాళ్ళు పాదాలమీద నిలబడలేని, పిర్రలమీద కూర్చోలేని, వీపుమీద పడుకోలేని స్థితిలో వున్నారు. వాళ్ళ గుడ్డలు నెత్తురుతో అట్టలు కట్టివున్నాయి. విధీ విరామంలేని వాళ్ళ మూలుగుల్ని వాళ్ళు ఆపుకోలేని బాధలో వున్నారు.

అలాంటి స్తితిలో వాళ్ళని వేన్‌లో పడేసి తీసుకుపోతున్నారు. ఆ ప్రయాణం కటిక చీకటిలో సాగుతోంది. వేన్ మీద పెద్ద టార్పాలిన్ కప్పారు. వేన్ పోయే మార్గంలో వూళ్ళ వాతావరణంగానీ. మనుషుల అలికిడిగాని ఏమీ లేదు. వేన్ గుబురుగా ఎత్తు తక్కువగా వున్న చెట్లకింద నించి పోతూ వున్నట్టుగా తరుచుగా టార్పాలిన్‌కి చెట్ల కొమ్మలు రాసుకుంటున్నాయి.

గతంలో ఎన్నో వార్తలు విన్న అనుభవంవల్ల రాజారావుకి చాలా తొందరగా అర్థమైంది- తమని అడివిలోకి తీసెకుపోతున్నారని!

నిశ్శాంతపడిపోయూ డతను,

వెంటనే రమణ వేపు చూడాలని ప్రయత్నించాడు-చీకట్లో.

రమణ ఘోరంగా మూలుగుతున్నాడు.

రాజారావు కొయ్యబారి కూర్చున్నాడు. పోలీసుల దయార్ధ్ర హృదయాల మీదా, వాళ్ళ మానవత్వం మీదా అతనికేమీ భ్రమలు లేవు. అయినా నమ్మలేకపోతున్నాడు. తమని అంత అన్యాయం చేస్తారంటే. అడవిలోంచి ఇంకే వూరికైనా తీసుకుపోతున్నారేమోనని కొంచెం ఆశపడ్డాడు.

అతని ఆశ చెల్లాచదురై పోడానికి కొంతసేపు పట్టింది.

భయంకరమైన చీకటి గుహలోకి ప్రవేశించినట్టుగా దట్టమైన చెట్లమధ్య ఆగాయి. వేన్లు.

రాజారావుకి చాలా స్పష్టంగా నిర్ధారణ అయిపోయింది.

"రమణా!" అని పిలవబోయాడు ఆతృతతో. కంఠం పెగలలేదు. శబ్దం రాలేదు.

ధైర్యంగా వుండమని రమణకి చెప్పాలని రాజారావు ప్రయత్నం

అడివంతా గుప్పున వెలిగింది.

అడివి మధ్య రెండు పెట్రోమాక్సు లైట్లు వెలిగించారు.

ఆ కాంతి టార్పాలిన్‌లోంచి కూడా వేన్‌లోకి చిందింది.

రమణ మూటలా పడివున్నాడు. అతను ఎక్కడో లోయలోంచి మాట్లాడినట్లు దాదాపు శబ్దం రాని కంఠంతో

రెండు మాటలు మాట్లాడాడు- "రాజూ మనం ధైర్యంగా..."
రమణకు కూడా అంతా అర్థమైపోయింది.

రాజారావు కళ్ళలోంచి జలజలా కన్నీళ్ళు రాలాయి. తను ఏం చేసినా సరే, రమణని విడిచిపెడితే. అతన్ని వెనక్కి తీసుకుపోతే చాలని అతని మనసు ఆరాట పడింది.

పెద్ద శబ్దంతో వేన్ తలుపు తెరిచి లోపలికి టార్చి లైటు వేశారు.

వేన్ అడుగున పడివున్న రమణని బరబరా ఈడ్చి మూటలా కింద పడేశారు. రాజారావుని తాళ్ళు పట్టి గుంజి కిందకి లాగారు.

రమణ నెమ్మదిగా కూర్చోడానికి ప్రయత్నిస్తూ — "రాజూ నేను ధైర్యంగా వున్నాను" అని అరిచాడు.

స్పెషల్ బ్రాంచి సూపరింటెండెంట్ హడావుడి పడుతూ కంఠం తగ్గించి ఆదేశాలు జారీచేస్తున్నాడు. మిగిలిన ఆఫీసర్లలో అందరికన్నా పొట్టివాడు అడుగడుగునా వుత్సాహం ప్రదర్శిస్తున్నాడు.

నిలబడలేని స్థితిలో వున్న రమణనీ, రాజారావునీ లాక్కుపోయి చెట్లకి కట్టేశారు. భుజాలదగ్గర్నుంచి పాదాల వరకూ తాళ్ళతో బిగించేశారు.

"ఇప్పటికైనా చెప్పండి. మీకు తెలిసినవన్నీ చెప్పేయ్యండి. విడిచిపెడతాం." అన్నాడు పెద్దవాడు.

నిజానికి అప్పుడు వాళ్ళు ఎంతెంత రహస్యాలు చెప్పినా వాళ్ళని విడిచిపెట్టేమాట మాత్రం కల్ల.

ఈ క్షణంలో అయినా చెప్పుకోవాలనే అభిప్రాయం

రమణకో రాజారావుకో కలిగితే వాళ్ళు చెయ్యగలిగిందల్లా ఒక్క-టే- ప్రసాద్ వివరాలు చెప్పటం. ఈలోగా ప్రసాద్ తన బస మార్చి వుండకపోతే ప్రసాద్‌ని పట్టి ఇవ్వడం. అంతకుమించి వాళ్ళు చెయ్యగలిగిందేమీ లేదు— పోలీసులు అడిగిన వందలకొద్దీ విషయాల్లో వాళ్లు ఒక్క సంగతి కూడా చెప్పలేదు. ప్రసాద్ గురించి ఏమైనా చెప్పాలనే ఆలోచన వాళ్ళకు ఒక్క సెకన్‌లోకూడా రాలేదు. అది సత్యద్రోహం, మిత్రద్రోహం, విప్లవద్రోహం అని వాళ్ళెరుగుదురు.

వాళ్ళ ఆశయం వున్నతం!

దాన్ని చేపట్టినవాళ్లు వున్నతులు!

"ఆఖరిసారి ఆలోచించుకోండి. ఇప్పటికయినా నిజం చెప్పండిరా?" అని పోలీసు పెద్ద ఆఖరి ప్రయత్నంగా అరిచాడు.

రాజారావు తన శక్తినంతా కూడగట్టుకుని "ఒరే పోలీసు పిశాచం!" అని ఒక గావుకేక పెట్టాడు. "నిజమే చెపుతున్నారా! మా శరీరాల్ని హతమారుస్తావు గానీ మా సిద్ధాంతాన్నీ, మా విప్లవాన్నీ నువ్వేం చెయ్యలేవురా. ప్రతీ అర్ధరాత్రి కటిక చీకట్లో విప్లవకారుల్ని అడవుల వెంట ఈడ్చుకువచ్చే శ్రమ మాత్రం మీకు తప్పదురా. ప్రజలకోసం మరణం హిమాలయాలకన్నా వున్నతమైనదని మాకు తెలుసు. ప్రజా వుద్యమకారుల కఠిన దీక్షలూ. అజేయ శక్తులూ అపార త్యాగాలూ మీలాంటి నీచులు, దోపిడీ దొంగలు ఎన్నటికీ అర్థంచేసుకోలేరు. ప్రజలు సమస్తాధికారాలూ తమ చేతుల్లోకి తీసుకుని మీలాంటి దేశద్రోహుల్ని, నర పిశాచాల్ని తమ

న్యాయస్థానాల్లో నిలబెట్టి దండించే రోజు వస్తుంది. ఆ రోజు కోసం మేము, విప్లవకారులం, వేలాదిగా లక్షలాదిగా సునాయాసంగా మహా గర్వంతో ప్రాణాలు అర్పణ చేస్తాం. కాల ప్రవాహాన్ని ఆపలేవు. నిన్ను ముంచేసే విప్లవ ప్రవాహాన్ని ఆపలేవు."

ఆ విప్లవకారులు ఆ క్షణాలలో అత్యంత సుందరమైనా. పరమోన్నతమైన ప్రజలునిర్మించుకునే భారతదేశాన్ని దర్శించ గలిగారు.

"రమణా! విప్లవానికి స్వాగతం చెప్పు" అని మహోద్రేకంతో అరిచాడు రాజారావు.

"విప్లవం వర్ధిల్లాలి !

విప్లవం వర్ధిల్లాలి !

విప్లవం వర్ధిల్లాలి !"

విప్లవ నినాదాలతో అడివి మారు మ్రోగుతోండగా తుపాకీ మోతలు వాటిని ముంచేశాయి.

తుపాకీ మోతలతో అడివిదద్దరిల్లింది.

తుపాకీ మోతలతో రెండు దేహాలు చీల్చుకుపోయాయి.

తుపాకీ మోతలతో విప్లవ కంఠాలు పూడిపోయాయి.

రెండు నిమిషాలలో అడివి ఎప్పటి నిశ్శబ్దంలో మునిగింది.

*　　*　　*　　*

నాలుగు రోజుల తర్వాత కొన్ని పేపర్లలో ఒక వార్త వచ్చింది.

"...అడవిలో వుగ్రవాదులు మకాం పెట్టివున్నారన్న వార్త తెలిసిన పోలీసులు హుటాహుటీన ఆ ప్రదేశానికి వెళ్ళగా అక్కడ వుగ్రవాదులు పోలీసులపై కాల్పులు జరిపారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు కూడా ఎదురు కాల్పులు జరపవలసి వచ్చింది. వుగ్రవాదులకూ పోలీసులకూ మధ్య రెండు గంటలకు పైగా జరిగిన ఘర్షణలో ఇద్దరు వుగ్రవాదులు మరణించారు. ఒక స్త్రీతో సహా కొందరు వుగ్రవాదులు తప్పించుకుపోయారు. ఇద్దరుపోలీసులకు స్వల్పమైన గాయాలు తగిలాయి. ఆ ప్రదేశంలో వుగ్రవాద సాహిత్యానికి సంబంధించిన కొన్ని పుస్తకాలూ, కరపత్రాలూ, మూడు నాటుబాంబులూ, రెండురైఫిల్సూ దొరికాయి. ఈ వుగ్రవాదుల ముఠాకు అనేక దోపిడీలతో, హత్యలతో సంబంధం వున్నట్టు పోలీసు ప్రధాన కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది."